నమ్మలేని నిజాలు

కామదహనం
ఆమని ఆగమనం
రంగుల హోళీ.
వంట గ్యాస్ మంట
యుద్ధంతెచ్చిన తంట
ధరల పొగ.
వక్రీకరణ
చరిత్ర వికారాలు
సత్యం సమాధి
అంగడి చిత్రం
వింతవింత దృశ్యాలు
రంగుల కల
క్రికెట్ పండుగ
గెలిస్తే కప్పుమెప్పు
ఓడితే తిట్లు
- రేడియమ్
సెల్: 9291527757




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


శ్రీనిజం

అపుడు కదుతుంటె ఇండ్లు
కండ్లు మూసుకున్నారా ?
ఇపుడు ఎర్ర జేసి కండ్లు
ఇండ్లు కూల్చుతున్నారా ?
హైకోర్టు చెప్పుతున్నా
నిట్టనిలువు కూల్చుడేంది ?
లబోదిబో మొత్తుకున్న
కట్టెల్లో కాల్చుడేంది ?
- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 16-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:192 పేజీలు:6 వెల: రూ.1/-

## దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యాటక అభివృద్ధి

-మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, ఏప్రిల్ 15: చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావుతో కలిసి ఆయన చార్మినార్, చౌమొహల్లా ప్యాలస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా చార్మినార్ తో పాటు పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా మచిలీ కమాన్ పునరుద్ధరణ కోసం ఇప్పటికే కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ. 3.64 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే షేర్-ఇ-బాతీల్ కమాన్ రినోవేషన్ పనులను కూడా తక్షణమే చేపట్టాలని, చార్మినార్ వద్ద ఉన్న ఫౌంటైన్‌ను పర్యాటకులను ఆకర్షించేలా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు జూపల్లి తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అటు ఆదాయం, ఇటు స్థానికులకు ఉపాధి పెరుగుతుందని చెప్పారు.

### నగర వారసత్వ సంపదపై ప్రత్యేక దృష్టి..

హైదరాబాద్ నగరాన్ని పర్యాటక పరంగా ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించి, నగర వారసత్వ సంపదను కాపాడుతూనే ఆధునిక హంగులు అద్దుతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం.. పడవ మునిగి 250 మంది గల్లంతు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: అండమాన్ సముద్రం లో ఘోర ప్రమాదం జరిగింది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరుల తో వెళ్తున్న ఓ పడవ నీటిలో మునిగిపోయింది ఈ ఘటనలో దాదాపు 250 మంది గల్లంత య్యారు. గల్లంతైన వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగు తున్నాయి. వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది.

ప్రమాదానికి గురైన పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లోని టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఐక్యరాజ్య సమితి తన ప్రకటనలో పేర్కొన్నది. పడవ బంగ్లాదేశ్ నుంచి మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించింది. అదేవిధంగా పడవలో పరిమితికి మించి జనం ఎక్కడం కూడా ప్రమాదానికి మరో కారణమై ఉండవచ్చని తెలిపింది. మునిగిన పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోం ది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదానికి గురైనట్లు ఐక్యరాజ్యసమితి అధికారులు వెల్లడించారు.

వాస్తవానికి రోహింగ్యాలు మయన్మార్‌కు చెందినవారు. కానీ 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది మంది బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దాంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే ఇటీవల అక్కడి పరిస్థితులు కూడా క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను వారు ఎంచుకుంటున్నారు.

## దద్దరిల్లిన సారండా అటవీ ప్రాంతం.. మావోలు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు..

రాంచీ, ఏప్రిల్ 15: జార్ఖండ్‌లోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. చోటా నగర్ పోలీస్ స్టేషన్ పరిధి బాబుదేరా అడవిలో భద్రతా దళాలు కూంబింగ్ చేస్తుండగా ఇవాళ(బుధవారం) తెల్లవారు జామున ఇరువర్గాలు ఎదురుపడ్డాయి. దీంతో వారి మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి.

ఈ దాడిలో పలువురు మావోలకు బుల్లెట్ గాయాలు అయ్యాయని, మరికొంతమంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత మిసిర్ బెస్రా కోసం బాబుదేరా అడవిలో సీఆర్పీఎఫ్ కోబ్రా బెటాలియన్, జార్ఖండ్ జాగ్వార్, జిల్లా పోలీస్ సంయుక్త బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఎన్‌కౌంటర్ జరిగింది.

ఈ సందర్భంగా ఓ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతూ..'మిసిర్ బెస్రా కోసం భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయి. వారిని చూడగానే తొలుత మావోయిస్టు దళం కాల్పులు జరిపింది. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు చనిపోయినట్లు అనుమానిస్తున్నాం. అయితే, ఇంతవరకూ మృతదేహాలు లభించలేదు. ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి' అని తెలిపారు.

## మాకు రూ.25 లక్షల కోట్లు చెల్లించండి..

### అమెరికాతో చర్చలకు ముందు ఇరాన్ డిమాండ్..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 25 లక్షల కోట్లు) పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్ కోరుకుంటోంది

యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరిం చడం సాధ్యం కాదని, అంతర్జా తీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు ధ్వంసం అవడమే కాకుండా, చమురు, వాణిజ్య రంగాల్లో మూసివేత వల్ల నష్టాలు భారీగా ఉన్నాయని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నష్టాల అంచనా ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు

తమ నష్టాలను భర్తీ చేసుకునేందుకు హోర్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకలపై పన్ను విధించడం వంటి చర్యల ను కూడా ఇరాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, యుద్ధ సమయంలో ఐదు అరబ్ దేశాలు తమ భూభాగాన్ని ఉపయో గించేందుకు అమెరికా- ఇజ్రాయెల్ దళాలకు అనుమతి ఇచ్చాయని, ఆ దేశాలు కూడా తమకు పరిహారం చెల్లించాలని ఇరాన్ ఇప్పటికే కోరింది.

## బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సామ్రాట్ చౌదరి..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:బిహార్ నూతన సీఎంగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణం చేశారు. బుధవారం పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ ప్రమాణం చేశారు. గవర్నర్ సయ్యద్ అట హస్నైన్.. సామ్రాట్‌తో ప్రమాణం చేయించారు. ఇప్పటిదాకా సీఎంగా ఉన్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన రాజ్యసభలో సభ్యత్వం పొందారు. ఇప్పుడు ఆయన స్థానంలో సామ్రాట్ చౌదరి సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

బిహార్‌లో ప్రస్తుతం జేడీయూ, బీజేపీ, ఇతర పార్టీలతో కలిసి ఎన్‌డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. ఇంతకాలం జేడీయూ నుంచి నితీష్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించగా, ఇంతకాలం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత సామ్రాట్ చౌదరి సీఎం పదవి చేపట్టారు. బీజేపీకి సీఎం పదవి దక్కడంతో జేడీయూకు రెండు డిప్యూటీ సీఎం పదవులు లభించాయి. జేడీయూ ఎమ్మెల్యే విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌లు డిప్యూటీ సీఎంలుగా ఎన్నికయ్యారు. వీరికి క్యాబినెట్ మినిస్టర్లుగా హోదా దక్కుతుంది. బీజేపీ తరఫున బిహార్‌లో సీఎం పదవి చేపట్టడం ఇదే తొలిసారి. ఇంతవరకు రెండు దశాబ్దాల వరకు బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామ్యం కలిగి ఉంది. కానీ, ఒక్కసారి కూడా బీజేపీకి సీఎం పదవి దక్కలేదు. తొలిసారి ఆ పార్టీ నుంచి సామ్రాట్ సీఎం పదవి చేపట్టి అసామ్రాట్. సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే సామ్రాట్.. సెక్రటేరియట్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం దేశంలో సీఎం పదవిలో కొనసాగుతున్న 16వ బీజేపీ నేతగా సామ్రాట్ నిలిచారు. అంటే.. ప్రస్తుతం 16 రాష్ట్రాల్లో సీఎంలుగా బీజేపీ నేతలు కొనసాగుతున్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ఇప్పటివరకు బీజేపీ తరఫున సీఎం పదవి దక్కిన 19వ రాష్ట్రం బిహార్. బీజేపీ చరిత్రలో ఆ పార్టీ నుంచి సీఎం పదవి దక్కించుకున్న 57వ వ్యక్తి సామ్రాట్. గతంలో ఆర్‌జేడీలో ఉన్న ఆయన 2017లో బీజేపీలో చేరారు. బిహార్‌లో వచ్చే నెలలో మంత్రివర్గ విస్తరణ జరగనుంది.

## కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నాం: -ఎంపీ మల్లు రవి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: సీఎం రేవంత్ రెడ్డి పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ మల్లు రవి తీవ్రంగా ఖండిం చారు.

సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మం త్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నట్లు తెలిపా రు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నిం చారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాట లను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. మహిళా రిజర్వే షన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ డిమాండ్ చేశారు.

భారతదేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తుచేశారు. భారతదేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు.

## భారత్‌లో చొరబాటుకు సిద్ధంగా 800 మంది ఉగ్రవాదులు..

### పాకిస్థాన్ భారీ కుట్రను పసిగట్టిన నిఘా వర్గాలు..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: జమ్మూకశ్మీర్ లో మరోసారి అలజడి సృష్టించడం కోసం పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదుల ను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం కలిసి ఈ ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు ఇవాళ (బుధవారం) హెచ్చరించాయి. ఉగ్రవాదులను చొప్పించడం కోసం పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు వెల్లడించాయి.

ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉంది. అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా భావించి పాకిస్థాన్ ఈ కుట్రకు పాల్పడుతోందని నిఘా విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం ఉన్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దాంతో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుంది.

ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున గ్రూపులుగా ఉగ్రవాదులను పంపి భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని పాకిస్థాన్ చూస్తోంది. ఇలాచేస్తే కొందరైనా భారత్‌లోకి చొరబడగలరని పాకిస్థాన్ భావిస్తోంది. గత ఏడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దాంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

## విషాదం.. గ్యాస్ సిలిండర్లు పేలి నలుగురి మృతి

శ్రీ సత్య సాయి జిల్లా, ఏప్రిల్ 15: కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ మంటలు చుట్టు పక్కల వ్యాపించడంతో భారీ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది.

గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గ్యాస్ మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయపడి బయటకు పరుగులు తీశారు.

## నాటో కూటమి గతంలో లేదు.. భవిష్యత్తులో కూడా ఉండదు : డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:ఇరాన్ తో యుద్ధం చేసే విషయంలో, హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన.. తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు.

అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులో ఉండబోదని అసహనం వ్యక్తంచేశారు. కాగా గత కొన్ని రోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు.

మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో-14, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు.

పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో



ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. యూరప్ ప్లాన్ బీపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే.. ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించుకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. బుద్ధవిహార్ పరిధిలో స్లమ్ ఏరియాలో మంటలు చెలరేగడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి అవ్వడం స్థానికంగా అందర్నీ కలిచి వేసింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధవిహార్ పరిధిలోని స్లమ్ ఏరియాలో సుమారు 400 చదరపు గజాల ప్లాస్టిక్ స్క్రాప్‌ను నిల్వ ఉంచారు. దాని చుట్టే పలు గుడిసెలను నిర్మించుకున్నారు. అయితే బుధవారం తెల్లవారు జామున 1.25 గంటల ప్రాంతంలో స్క్రాప్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన గుడిసెల్లోని కుటుంబాలు మంటలు అప్రమత్తమయ్యేలోపే మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఇరుకైన వీధుల కారణం గా అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలికి చేరుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, గుడిసెలకు మంటలు అంటుకోవడంతో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు, మూడేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో భద్రతా ప్రమానాలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

### చురక

సర్కారు మహిళాబిల్లు
సందుగిప్పుతున్నది
రిజర్వేషన్ ఎన్నికల్లో
రూపుదాల్చుతున్నది.
రాజకీయ సాధికార
రహదారి మంచికే
భర్త చాటు భార్యఐతే
భవిష్యత్తు కంచికే



-వేల్పుల నారాయణ
9440433475

### రాధశ్రీ రాగాలు

అడుగు జాడలు విడువు
క్రొత్త దారిన నడువు
ఆనంద మొందెదవు
అనును రాధశ్రీ !!
చదువులను "కొను"వాడు
పదవులను "కొను"వాడు
చేయు జనులకు కీడు
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 16-4-2026

## మహా జాతకం

అరటితొక్క మీద కాలేసినా
అతడు జారి పడపోవడం లేదు
తల్లి గర్భంనుంచి జారడం నేర్చుకున్నాక
ఆకాశంనుంచి జీవితం జారినా సరే
తన జాతకాన్ని తానే రాసుకుంటూ....
రంగుల మాటలు




–డా. కె.జి. వేణు
98480 70084

## సప్త పదులు
ప్రక్రియా సృజనకర్త: సుధామ

పొరబాటు
తడబాటు
చిన్నచిన్న మనస్పర్ధలతో కుటుంబాలలో పెరిగిపోతున్న ఎడబాటు.
–వి. సుబ్బారావు, పెందుర్తి.

సిద్ధాంతం
రాద్ధాంతం
పోరు ముగిసిన తర్వాత దెయ్యాల వేదాంతం.
–రామాయణం దుర్గా ప్రసాద్. ఉదయగిరి

ప్రగతి
జగతి
తోటివారిపై చెడు తలపెట్టిన వారికి అధోగతి
–శైలజ సామినేని–విజయవాడ



డా॥ నందిని సిధారెడ్డి, శ్రీమతి మల్లీశ్వరి దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

# మానవీయ ఉద్యమ కవి నందిని సిధారెడ్డి




సభలో ప్రసంగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి. వేదికపై బి.వి.ఎన్.స్వామి, కందుకూరి శ్రీరాములు, దేశపతి శ్రీనివాస్, దాసోజు పద్మావతి.

తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి అభినందన సభ ఈనెల 11న రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరిగింది. తెలంగాణ జిల్లాల నుంచి హాజరైన తెరసం బాధ్యులు, కవులు, రచయితలు నందిని సిధారెడ్డిని ఘనంగా సన్మానించారు.

తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు కవులు, రచయితలు అభినందించారు.

సభాధ్యక్షులు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ నందిని సిధారెడ్డి తెలంగాణ అస్తిత్వ చైతన్యంలో శిఖరం లాంటివారు. కవులు, రచయితలు, కళాకారులను సంఘటితం చేసి ఉద్యమ భావజాల వ్యాప్తికి మార్గదర్శనం చేశారని ప్రశంసించారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇటీవలి తెలుగు కవిత్వంలో **"అనిమేష"** ఒక మైలురాయి లాంటిది. ప్రకృతిని మనిషిని సమన్వయ పరుస్తూ మనిషి బాధ్యత గుర్తుచేసిన రచన. అనిమేషకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలంగాణకు లభించిన గుర్తింపు అన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సిధారెడ్డి నిబద్ధుడైన కవి. తెలంగాణ అస్తిత్వ చైతన్యానికి ప్రతీక. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం మనందరికీ గర్వకారణం అన్నారు.

ప్రముఖ కవి, రచయిత ఆచార్య కోయి కోటేశ్వరరావు నందిని సిధారెడ్డి వ్యక్తిత్వం, కవిత్వం గురించి వివరించారు. కాళోజీ వలె కాలంతో పాటు నడిచి ప్రజల మధ్య నిలిచిన గొప్పకవి నందిని సిద్ధారెడ్డి అన్నారు.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ వంగరి త్రివేణి సిధారెడ్డి కవిత్వంలోని శిల్పం గురించి వివరించారు.

తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి. శంకర్ కరోనా క్లిష్ట కాలంలో రాసి ఆవిష్కరించిన కావ్యం ఆధునిక తెలుగు కవిత్వంలో ఆణిముత్యం లాంటిది అన్నారు.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల నాయకుడు విరాహత్ అలీ మాట్లాడుతూ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రజల దృష్టిలో ఎప్పుడో వచ్చింది అన్నారు.

ప్రముఖ కవి, గాయకుడు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మధ్యాహ్నం సభకు హాజరై ప్రసంగిస్తూ దశాబ్దాలుగా తమకు మార్గనిర్దేశం చేస్తూ నడిపించిన కవి నందిని సిధారెడ్డి. భూమి స్వప్నం నుంచి అనిమేష వరకు ఆయన కవిత్వం మనిషి జీవితం కేంద్రంగా రూపుదిద్దుకున్నది అన్నారు.

టీఎన్జీవో మాజీ నేత దేవి ప్రసాద్ మాట్లాడుతూ నందిని సిధారెడ్డి మార్గదర్శనమే తమను ఉద్యమకారులుగా తీర్చిదిద్దింది అన్నారు.

తనకు జరిగిన సన్మానానికి నందిని సిధారెడ్డి స్పందిస్తూ కరోనా నేపథ్యంలో ప్రకృతి తల్లి పాత్ర పోషిస్తూ జీవులను కాపాడుకుంటూ ముందుకు సాగుతుంది. మనిషి తన బాధ్యతను గుర్తించాలి అనే భావనతోనే **అనిమేష** రచించాను. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సందర్భంగా అభినందనలు తెలిపినందుకు కృతజ్ఞతలు అన్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో కవులు, రచయితలు పొట్లపల్లి శ్రీనివాసరావు, కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్, రుద్రంగి రమేశ్, బిల్లా మహేందర్, ఏఎన్. జగన్నాథ శర్మ, లక్ష్మీరెడ్డి, ముచ్చర్ల దినకర్, గుండెల్లి ఇస్తారి, కందాళై రాఘవాచార్య, తూర్పు మల్లారెడ్డి, బి.వి.ఎన్ స్వామి, గడ్డం సులోచన, మోత్కూరి అశోక్ కుమార్, భగవాన్ రెడ్డి, యరకల యాదయ్య, శ్రీ భాష్యం అనూరాధ, దాసోజు పద్మావతి, ఆశిరెడ్డి లక్ష్మీ, చీదెళ్ల సీతాలక్ష్మి, సిధారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సభలో అభినందనలు తెలుపుతున్న అతిథులు

# "ఎదగండి బ్రో!"




"నీ పేరు మేంగోనా! అసలు ఇలాంటి పేర్లు ఎలా పెడతారయ్యా?! ఒక్కో పేరు వింటుంటే చిరాకు పుడుతుంది. అయినా, నీ ముఖం చూస్తే వేపకాయలా ఉన్నావు. నీ మాటలు వింటుంటే కాకరకాయ రసం తాగినట్లుంది. దేశం ఎటు పోతుందో? అర్థం కావడం లేదు" అంటూ వాపోయాడు ఓ పెద్దాయన.

"బాడీ షేమింగా?" అన్నాను. ముఖం చిట్లించాడు.

"బాబాయ్ గారూ! కొన్ని పేర్లు చెబితే మీరు గిలగిల కొట్టుకుంటారు. "ఏపిల్", "మేంగో" ఇవి పండ్లు. ఇవే పెద్ద కంపెనీలు. ఫోన్లు, లాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఇంకా సవాలక్ష వస్తువులు తయారు చేస్తున్నారు.

రెంచ్, స్పానర్, నట్, బోల్ట్, పంచర్ ఇవన్నీ మనుషుల పేర్లు. జనవరి నుండి డిసెంబర్ వరకు ఆడా, మగా పేర్లు. అమెరికాలో కాదు–మా ఇంట్లో కూడా! ఎవరి వృత్తిని బట్టి, ఎవరి టేస్ట్‌ని బట్టి వారి పేర్లు పెట్టుకుంటారు. మీరు మాత్రం తక్కువా?! పక్షులు, నదులు, పర్వతాలు, జంతువుల పేర్లు పెట్టుకోలేదా? తమరికి ఈ పేర్లతో గొడవెందుకు బాబాయ్" అన్నాను.

"నువ్వు పెద్ద ముదురుగాడిలా ఉన్నావే?!" అన్నాడు.

"దీన్నే బాడీ షేమింగ్ అంటారు. నేను ముదురునో, లేతనో, దోరనో పక్కనుంచుదాం. తమరు ఎలా ఉన్నారు? ఏక్ బార్ అద్దం మే దేఖో. నేను నీ బాడీ గురించి చెప్పాననుకో, నీ ముఖంలో రంగులు ఊసరవెల్లిలా మారతాయి. నిన్ను ఇలా వదిలేస్తే పిల్లల్నే కాదు, ఆడవాళ్ళని, మగవాళ్ళని, చివరకి ట్రాన్స్‌జెండర్‌లని కూడా ఎన్ని రకాలుగా కామెంట్ చేసి ఆనందిస్తావో నాకు తెలుసు. ఈ పనులు మానుకో. లేదంటే అందరూ తిరగబడ తారు" అన్నాను.

"వీడిని అనవసరంగా కెలికాను" అంటూ గాయబ్.

×××

ఇంకో పెద్దాయనతో 'చర్చ' గురించి చెబుతాను.

"నీకు బుడుగు తెలుసా?"

"తెలుసు. ముళ్ళపూడి వెంకట రమణ గారి క్రియేషన్!"

"మరేంటి? మేంగో ఇజం అంటూ బయలుదేరావు?. 'బుడుగు' ఉండగా నీ అవసరం ఉందా? పిల్లల సైన్యానికి అధికారిలా సెల్ఫ్ ప్రమోషన్. నువ్వు బుడుగుకి కార్బన్ కాపీవి."

"నువ్వు కవిత్వం రాస్తావా? కథలు రాస్తావా? విమర్శకుడివా?"

"ఏంటిరో! ఏకవచనంతో పిలుస్తున్నావు?"

"తమరి పిలుపు ఎలా ఉంది? మృదువుగా చర్చ మొదలు పెట్టారా? 'బుడుగు' మాత్రమే కాదు. 'చిన్ని' ఉన్నాడు. 'బుల్లి' ఉన్నాడు. గీత, సంధ్య ఉన్నారు. వాళ్ళు నీకు తెలుసా? ఇంతకీ తమరేం చేస్తారో చెప్పలేదు" అన్నాను.

"నేను కవిని, కథలు రాస్తాను?"

"'బుడుగు' రోజులు వేరు. అప్పుడు 'పెసూనాంబ' ల గురించి మాట్లాడాడు. తర్వాత పిల్లలందరూ షటప్పులయిపోవాలా? మరి శ్రీశ్రీ, తిలక్, రవీంద్రుడు ఇంకా సవాలక్ష మంది కవులూ, కథకులు ఉన్నారు. తమరి అవసరం ఉందా? ఎన్టీ రామారావు, అక్కినేని యాక్టర్లు. వారు లేరు. ఇంక నటుల అవసరం లేదా? అందరూ దుకాణాలు మూసుకోవాలా?"


"మేం మీలా పుట్టగానే ఇలా దేశం మీద పడలేదు. సంవత్సరాలపాటు అధ్యయనం చేశాం."

"మంచిదే కదా! మీకు ఛైల్డ్ ప్రాడిజీలు తెలుసా? విన్నారా? చూశారా? మూడు సంవత్సరాలు నిండకుండానే ప్రపంచ దేశాల రాజధానులు చెబుతారు. సంగీతంలో రాగాలు చెబుతారు. లెక్కలు చెబుతారు. ఇంత అధ్యయనం చేశారు. మీరు చేయగలరా ఈ పనులు?" అన్నాను.

"నీతో ఏదో తేడాగా ఉందే?!" అన్నాడు.


" అదేదో మీతో ఉంది. నేనింకా మాట్లాడటం మొదలు పెట్టకుండానే ఇన్ని దాడులా? చర్చ అంటే ఇలా నడుములు విరగ్గొట్టడడం కాదు. ఎవరూ సరికొత్త క్రియేషన్ చేయలేరు. ఆ సమస్యలు ఉన్నంతవరకూ రాస్తూనే ఉంటారు. మాట్లాడు తుంటారు. కార్బన్ కాపీలుంటాయి. అలాంటి వాటిని చెత్త కుప్పల్లోకి విసురుతారు. సరేనా?" అంటూ..,

"ఎదగండి బ్రో" అని ముగించాను.
ఇదీ విషయం. నో ఫియర్–లెటజ్ కంటిన్యూ!



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

## కవీ నా కవి



–జస్టిస్ బి. చంద్రకుమార్

ఏది చూసినా, విన్నా స్పందించే
అమాయక చక్రవర్తి నా
ఆధునిక కవి
స్పందించినా చేసేదేముంది
అరచినా అడిగే వాడు లేడు
అయినా, ఆలోచనలను కాగితం మీద
పెట్టకుండ ఉండలేడు–
ఆ కవిత అచ్చయితే చాలుననే
ఆశాజీవి నా ఆధునిక కవి–

ఏ ప్రతిఫలం ఆశించక
ఏ ప్రలోభాలు లేక
గీతలో చెప్పిన కర్మ సిద్ధాంతాన్ని
ఆచరించే కర్మయోగి నా కవి–
పెట్టెనిండా శాలువలు
అలమరనిండా మొమెంటోలు
ఆదాయం ఇవ్వలేని
అమ్ముదామంటే వీలులేని
అపార సంపద అది–
పెట్టెలో చోటులేక ఒక మూలకు
విసరివేయబడ్డాయి కొన్ని శాలువలు
ఒకటి రెండయితే మసిగుడ్డలుగా
దర్శనమిచ్చాయి–


ఇదేమిటని అడిగితే అంతకంటే
వాటి ప్రయోజన మేమిటని ఎదురు ప్రశ్న
ఈసారి మెమోంటోలు తేవద్దని
ఎక్కడో పార వేసి రమ్మని
తెచ్చారో చెత్తాబండిలో వేస్తానని
తెగేసి చెప్పింది అతని సతీమణి–

పారతోషికం అక్కర లేదు ప్రభూ
నా కవితను ప్రచురిస్తే చాలునని
సంపాదకునితో కవి వేడుకోలు
ప్రెస్‌వారిని బ్రతిమిలాడి ఎలాగో
వంద, రెండువందల కాపీల నూతన
కవితా సంపుటి వెలుగు చూసింది–
పాత అప్పు తీర్చనిదే
కొత్త కవితలు ప్రింట్ చేసేది
లేదని తెగేసి చెప్పిన ప్రెస్ యజమాని–
పుస్తకానికి వెల చెల్లించకపోయినా
ఫరవాలేదు ఫ్రీగా ఇచ్చింది చదివితే
చాలునని కవి అత్యాశ–

వందల పుస్తకాలు ఉచితంగా ఇచ్చినా
ఏ ఒక్కడూ చదివి నీ కవితలు
బాగున్నాయని అన్నవాడు లేడు–
అచ్చయిన పుస్తకాలు గుట్టలు గుట్టలుగా
సామాన్ల గదిలో చెత్త కుప్పలుగా
పడి ఉన్నాయి–
కవీ, కవి సమ్మేళనానికి రమ్మని కబురు
వంద రూపాయల శాలువా కొరకు
రెండు వందల రూపాయల చార్జీలు
బస్సులో నిలబడలేక
ఆటో చార్జీలు చెల్లించలేక
అయోమయంలో కవి–
కొద్దిమంది ప్రేక్షకులు కొట్టిన చప్పట్లే

అతనికి విటామిన్లు–
వెళ్ళేటప్పుడు వట్టి చేతులతో వెళ్లినా
వచ్చేటప్పుడు
శాలువా మొమెంటోల బరువు
దారిలో పడేయ లేక
ఇంటికి తేలేక
అయోమయంలో ఆధునిక కవి–
ఎంత రాత్రయిన ఏమి మాట్లాడినా
గుప్పెడు మెతుకులతో
ఆదరించే ఆధునిక కవి
సతీమణి.

## ఉక్కు మహిళ



అరవై ప్రాణాలను తన భుజాలపై
అవలీలగా మోస్తూ..
తీర్థయాత్రలను తిలకింప చేస్తున్న
ధీర మహిళ సరూర్ నగర్
స్వర్ణక్క..
దారి పొడవునా భక్తి
దీపమై ముందు నడస్తున్న నాయకురాలు.

ఉజ్జయినీ యాత్ర,
ద్వారకాదీషుని దర్శనం
నర్మదా నదీ పరీవాహం
అది సాధారణ ప్రయాణం కాదు,
అసాధారణ హృదయాల భద్రతను
తన చేతుల్లో పెట్టుకున్న ప్రతిజ్ఞ.
అలసిన యాత్రికులకు
ఆమె తల్లి చేతిలా మారి తినిపిస్తూ,
మారాం చేస్తున్న వారిని మందలిస్తూ..
అన్ని అక్కెరలని గమనిస్తూ సౌకర్యాల
నీడగా నిలిచింది.
గుజరాత్ దారుల్లో
సురక్షితంగా అడుగులు వేసేలా
జాగ్రత్తల వలయాన్ని నేసిన
ఒక అప్రమత్త నాయకురాలు స్వర్ణక్క .
ధైర్యం ఆమె నడకలో,
సేవ ఆమె హృదయంలో,
బాధ్యత ఆమె శ్వాసలో
అందుకే అందరి నోటా ఒకే పేరు
"ధీర వీర శూర ఉక్కు మహిళ
మా స్వర్ణక్క!"


ఎక్కడో పుట్టి,
ఎక్కడో పెరిగి, ఇక్కడ కలసిన మేమంతా
ఇప్పుడు..
ఒకరి కోసం ఒకరుగా ఆరాటపడే
మిత్రులమయ్యామ్ ..
అందరి హృదయాల కృతజ్ఞత
ఒక గాథగా మారింది
భక్తి మార్గంలో తల్లితనంతో నడిపించిన
నీ సేవా యాత్ర
కాలం పొడవున వెలుగుతూనే ఉంటుంది.



–నాంపల్లి సుజాత
9848059893

## ఇది కలయో నిజమో

రాజమార్గం నట్టనడుమ కారునాపి
మెరుపుతీగలా బయట కురికిందా యువతి
నీ వడిగినా అడగకున్నా
నన్ను నీ ప్రథమ ప్రేయసిగా
స్వీకరించమని వేడుకుంటా
జీవితాలని ఆవరించిన చేదుల్ని తొలగిస్తా
చీకట్లని చీలుస్తా
నన్ను నీవు స్వీకరించు
అందుకో నా బుగ్గల మీద మొగ్గలు కోసుకో
నా పెదాల పైన సిగ్గులు దోచుకో
అమాంతం కౌగిలించుకో.
సరే పద అన్నాను నేను
కలికాలం కదా...అవునుమరి
ఎప్పుడు పయనం అడిగాన్నేను
వెను వెంటనే మన మిద్దరమే చెట్టాపట్టాలతో
చెట్లమీదనుంచి గట్లమీదనుంచి పక్షుల్లా
ఎక్కడికీ పయనం ఎక్కడికైనా సరే
నూతన జీవనారంభానికి
వుండేలు దెబ్బలు తగలని చోటుకి
తుపాకుల శబ్దాలు వినిపించని ఆవలికి
దుఃఖాలు వెంటాడని దీవికి
పాచికలు పారని ప్రదేశానికి.
ఏమిటీ మౌనం..ఎందుకీ జాప్యం
వేగిరపడు వసంతం సమీపిస్తుంది..
ఆగు ఈ వంతెనను పేల్చేస్తా
ఇది కలయో నిజమో
–అనువాదం



–కోటం చంద్రశేఖర్
9492043348

## రాక్షస క్రీడ



యుద్ధానికి ఆయుధం అవసరం లేదు
యుద్ధోన్మాదం చాలు
రాక్షస ప్రవృత్తి దాని నైజం
ఎవడెవడు తన్నుకున్నానికొంపల తగలబడి పోతాయి
ఎవడెవడు తన్నుకున్న
అన్నికొంపలు తగలబడతాయి
చారిత్రగతిలో ఎన్ని రక్తపుటేరులు
ఇతిహాసమంతా రుధిరాల గని
ఎందరు నియంతల నంతం చేసింది కాలం
అహం..అధికారదహం..మదం..కామం..
కారణమేదైనా రక్తదాహం దాని బీజాక్షరం
యుద్ధొన్మదుల.నియంతల తుదిమజిలి
ఆత్మహత్యల పర్వం
అంతాగమ్యం తెలియని పోరాటం
ఊహకందని చివరి పర్యవసానం
యుద్ధానికి ఆయుధాలెందుకు
ప్రాణాలు..బలిపశువులు..
రక్త మాంసాలు ఉంటే చాలు
ఆనక... యీ రాక్షస హోమం ముగిసాక
అందరూ హాయిగా చేతులు కలుపుకుంటారు
విందులు..చిందులు..రాయబారాలు..సంధి బేరాలు
శాంతి వచనాలు..ప్రవచనాలు
లెక్కలు.నష్టపరిహారాల చర్చలు
తెల్ల పావురాలకు రెక్కలొచ్చి ఎగురుతాయి
అన్ని మతాల దేవుళ్ళు ఊపిరి పీల్చుకొని నవ్వుతారు
అంతా ప్రశాంతమని మీడియా. చిలుకల పాటలు
అయినా కలకాలం
యుద్ధ గాయాలు గుండెలను కొలిమిలా చేస్తాయి
హృదయ రక్త కాసరాలు కష్టాల్లా మండుతుంటాయి
చిద్రమైన కళేబరాల అంగాలు
బాగలకొరకు వెదుకుతుంటాయి
మిగతా భాగాలను వెదుక్కుంటుంటాయి
కూడు..గూడు..నీడ దోచుకోబడ్డ నెల
ప్రశ్నార్ధక మవుతుంది
అనాథ బాలల జీవశ్చవాలు
తిమిరంలో వైఫై లవుతాయి
తండ్రి లేని పిల్లలు..భర్తలేని భార్యలు
అంతాకోల్పోయినవృద్ధులు ఊగుతున్న లోలకాలు
నేలంతా బూడిద..నీరంతా రుదిరం..గాలంతాకమురు
హృదులన్నీ రుధిర ప్రజ్వలనాలు
చీకటి రాబందుల విహార క్షేత్రాలు.
కళ్ళన్నీ రక్త కాసారాలు
వీటికి ఏ నష్ట పరిహారాలుండవు
కూలిన శవాలకు సైతం ఓదార్పులుండవు
ఆకాశం సైతం చచ్చి పోతుంది ఇక్కడ
మానవత్వపు అమృత తుంపర్ల కోసం
అనాథలా చకోరం లా పిచ్చి కాలం.....



–చకోనా
9885797375

# అనిశెట్టి రజిత దీర్ఘ కవిత “ఓ లచ్చువ్వ”

## ఏప్రిల్ 14 అనిశెట్టి రజిత జయంతి సందర్భంగా




అనిశెట్టి రజిత గారు రచయిత్రి, గాయకురాలు, ఉద్యమ జీవి, ఉపన్యాసకు రాలు ,కథలు ,కవితలు,వ్యాసాలు అన్ని ప్రక్రియలు రాసేవారు .రుద్రమ సాహిత్య సామాజిక వేదిక వ్యవస్థాపకురాలు. రుద్రమ సంస్థ నుండి పుస్తకాలను ప్రచురణ చేశారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక వ్యవస్థాపక సభ్యురాలు. జాతీయ అధ్యక్షురాలుగా విధులు నిర్వహించారు.

**జననం 14 ఏప్రిల్ 1958**
**మరణం 11 ఆగస్టు 2025**

నివాసం: హనుమకొండ.

తల్లి జయలక్ష్మి తండ్రి బాలరాజు.

ఫార్మసీలో డిప్లమా చేశారు. బియె లో, ఎం.ఏలో బంగారు పతకం సాధించారు . ఎం.ఫిల్ చేరారు. వివిధ కారణాల వలన పూర్తి చేయలేకపోయారు .ప్రీ.పీహెచ్డీ లో డెబ్బై శాతం సాధించినా పిహెచ్ .డి చేయలేకపోయారు. 1992లో కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగిగా చేరి పదవీ విరమణ పొందారు.

తొలి దశ1969- 71 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. మలి దశ ఉద్యమం లో క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారిణి. అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొనేవారు. స్త్రీ పక్షపాతి.

స్త్రీ ఉద్యోగులకు అండగా నిలిచేవారు. వరంగల్ లోని అన్ని సాహితీ సంస్థలతో కలిసి నడిచేవారు. రచయిత్రులకు చేయూతనిచ్చారు. సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని చెప్పేవారు. రుద్రమ సంస్థనుండి వీరు సంకలనాలు, ఇతరులపుస్తకాలు ముద్రించారు. అవసరార్థులకు సహాయం చేసేవారు. రోడ్డుపై జీవించే వాళ్లకు దుప్పట్లు రగ్గులు పంచేవారు. ఉదార స్వభావం కలవారు. అమ్మ నాన్నల పేరు మీద పాకాల యశోద రెడ్డి, సుగుణమ్మ గారి పేరు మీద అనాథ పిల్లలకు భోజన సౌకర్యాలు అందించేవారు. ఊరకుక్కలకు, పెంపుడుకుక్కలకు అన్నంవండి పెట్టేవారు.

మొక్కలను పెంచేవారు. తెలంగాణ సమాజంలోని సామాజిక అంశాలను సాహిత్యంతో స్పృశించి ప్రజలను,వర్ధమాన రచయితలను చైతన్యపరిచే నిస్వార్థ వ్యక్తి. వీరి రచనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు,ఎన్నో సంస్థలు అవార్డులు అందించాయి.

జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ ట్రస్ట్ న్యూఢిల్లీ వారి అవార్డు.

భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారి ధీరాంగన సావిత్రిబాయి పూలే ఫెలోషిప్ అవార్డు.

సుశీలా నారాయణ రెడ్డి కవిత్వగ్రంథ రచన పురస్కారం.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం ప్రదానం చేసింది.

ఇలా ఎన్నో పురస్కారాలు అందుకున్న గొప్పవనిత.

తెలంగాణ ముద్దుబిడ్డ,హనుమకొండ నివాసి

సాహితీ ,సామాజిక సేవకురాలైన అనిశెట్టి రజిత గారు లేనిలోటు తీర్చలేనిది

సమాజంలో మూడు వంతుల మంది ఉన్న దళిత బహుజన మహిళల స్థితి చాలా దయనీయంగా ఉన్నదని, దీనికి మూలం కుల ,వర్గ వివక్షతల ఉక్కు కవచానికి బంగారపు గొడుగు పడుతున్న బ్రాహ్మణిజమని, ఈ అవగాహనతోనే సామాజిక అసమానతలు మానవ హోదాలోని తేడాలు మానవ గౌరవం లేని స్థితి పట్ల నిరసన ఆగ్రహం ప్రకటించడం నా హక్కు అన్నారు రచయిత్రి అని శెట్టి రజిత.

మన సమాజం బ్రాహ్మణిజం. పితృస్వామ్యాల రక్త మాంసాలతోటి నిర్మించబడి ఉన్నది.ఆ కపట కట్టడాలను కూలగొట్టేందుకే విప్లవస్ఫూర్తితో దళిత బహుజన మహిళ శక్తి అందిన ఆయుధాన్ని పట్టింది. మానవ విలువలను పతనం అంచులకు వేలాడుతున్నాయి. ధనిక వర్గం మరింత ధనికులవుతున్నారు. పేదలు మరింత పేదలవుతున్నారు. పూలే దంపతులు ,అంబేద్కర్

మహాకవి జాషువాల ఆత్మ గౌరవ ఆశయ పోరాట స్ఫూర్తి తోటి 21వ శతాబ్దపు దళిత స్త్రీ శతాబ్దమని ప్రకటించిన దళిత స్త్రీ సాహిత్య పరిషత్ వ్యవస్థాపకురాలు బి.యం. లీలా కుమారికి జై భీమ్ అంటూ ఈ దీర్ఘ కవిత ఓ లచ్చువ్వను 2005లో ప్రచురించారు.

నాకు నచ్చిన పుస్తకం కీ.శే .అని శెట్టి రజిత గారు రచించిన “ఓ లచ్చువ్వ” దళిత బహుజన మహిళ దీర్ఘ కవిత. మారుతున్న కాలంతో పాటు మనుషులు మారుతున్నా... స్త్రీలు అనేక రంగాల్లో తమ ఉనికి చాటుకుంటూ ముందంజలో ఉన్న ఎక్కడో ఒక దగ్గర వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు అలా వివక్షం ఎదుర్కొన్న సర్పంచ్ లచ్చువ్వ కథ.

ఇది కరీంనగర్ జిల్లా ఒడ్యారం గ్రామంలో జరిగిన కథ ఇందులో దళిత స్త్రీ రాజకీయ జీవితాన్ని చిత్రీకరించారు.

చదువు రాని లచ్చువ్వ సర్పంచ్ అయింది. ఆ దళిత మహిళ కుర్చీ మీద కూర్చోవడం ఇష్టం లేని పురుషాధి కారాజ్యంలో వెనకడుగు వేయకుండా తనకు తాను ఓదార్చుకొని ఓ జాంబవతి వై, అరుంధతివై చండాలికవై చెలరేగాలంటుంది రచయిత్రి.

ఓ లచ్చువ్వ దీర్ఘ కవిత తిరుగు బాటు కవిత. అంటరానివారి ఆవేదనలు అందరికీ పంచిన కవిత .ఇందులో ప్రాంతీయవాదం ,దళితవాదం, స్త్రీవాదం ఉన్నవి. బహుజన కవిత. అనిశెట్టి రజిత తెలంగాణ యాస భాషల్లో రచనలు చేసిన తెలంగాణ ముద్దుబిడ్డ. సాహితీకారులలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న తెలంగాణ ముద్దుబిడ్డ.

**లచ్చువ్వా సూస్తివా**
**ఇగ్గో ఇప్పటికీ దూరమే**
**మైళ్ళకు మైళ్ళు దూరం**
**వాళ్లకు మనకు**
**మనిషికి నీడకు**
**వర్గానికి వర్గానికి**
**వెలివాడలంతా దూరం**
**అంటితే అపచారమంత దూరం**
**జన్మంత దూరం భారం**

ఆనాడు అంబేద్కర్ అంట రాని వానిగా సమాజంలో ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నాడో తెలుసుకున్నాం. మొదటి గురువులు జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే లో ఆదర్శాలే ప్రగతి పథానికి దారులు వేస్తాయని తెలిసినా, ఇప్పటివరకు వాళ్లకు మనకు మైళ్ళకు మైళ్ళ దూరం అని వెలివాడలంతా దూరం అంటుకుంటే అపచారమని జన్మంత దూరాభారం మోయాల్సిందేనంటూ సమాజంలోని కుల,మత, వర్గ వర్ణాలలోని లోపాలను ఎత్తి చూపారు.

**అడుగు లచ్చువ్వా అడుగు**
**అడుగుల గురించి**
**........**
**రాతలు రాసిన బ్రహ్మనడుగు**
**బ్రహ్మపుత్రులైన బాపన య్యలను**
**పండితోత్తములను అడుగు**
**వాళ్లకు వాళ్ల అడుగులకు మడుగులొత్తే**
**ఆర్య క్షత్రియ వైశ్య శూద్రు లను అడుగు**
**అడుగు లచ్చువ్వా అడుగు.**

నిన్ను అట్టడుగుకు తొక్కిన అడుగుల గురించంటూ, సామాజికంగా అభివృద్ధి పథంలో ఉన్న వాళ్లందరినే కాకుండా ఆ బ్రహ్మ దేవుని కూడా అడుగు మమ్మల్ని అట్టడుగుకు ఎందుకు తొక్కి పడు తున్నావని అడగమంటుంది రచయిత్రి.



**మూడే అడుగులు చాలంట**
**ముంచేటందుకు**
**గొడిగేసుకొచ్చిన చిన్నయ్య వారి**
**...........**
**స్వర్గం వాళ్లకంట**
**పాతాళం మనకంట**
**గొర్రెలం గోవులం ఎడ్డి మొకాలం**

ఆనాడు బలి చక్రవర్తికి వద్దకు వామన రూపంలో వచ్చిన విష్ణుమూర్తి అడిగిన మూడు అడుగులు

అతని ఉనికికే శాపమైనవి.

ఎందరిందరకో దానమందించిన బలిని పాతాళానికి పంపిన వైనాన్ని వ్యంగ్యంగా చిత్రిస్తూ... మనం గొర్రెలం గోవులం ఎడ్డి మొకాలమంటూ.... తలవంచకు పోయే వాళ్లమే కాని ఎదురు తిరిగే వాళ్ళం కాదని

భారతదేశమంటే కులాల కుమ్ములాటలు. పాపం చేసుకుంటేనే కదా పవిత్ర దేశంలో శూద్రులు, అతిశూద్రులుగా పుట్టినామంటూ, కులాల జులుమును ఎండగడుతూ మనిషి పుట్టకముందే కులం పుడుతుందని ఈ కులపు రోగాలు ఎప్పుడు వదులుతాయో అంటూ బాధను వ్యక్తం చేసింది.

**ఇక్కడ వేదాలున్నాయి**
**పుణ్యాలున్నాయి పాపాలున్నాయి**
**కుళ్ళు శాసనాలున్నాయి**
**............**
**మన ఉనికంటే నీచం**
**..........**
**మన నీడ పడితే అనుమానం**
**మనది తక్కువ కులమని**

భారతదేశంలో వేదాలు ఇతిహాసాలు ఉన్నాయి. పుణ్యాలు పాపాలు కుల్లు శాసనాలున్నాయి. కులం పునాదువు వీడటం లేదని,

పంచములమని చదువు గురించి ఆలోచించకూడదని శంభుకుని,సత్యకామ జాబాలి ఏకలవ్యుని కథనాల ద్వారా జ్ఞానం ఉన్న వాళ్లకు ఊడిగం చేయాలి గాని, జ్ఞానాన్ని సంపాదించిన పనికిరాకుండా చేస్తారని, మన కష్టాలు, మన దరిద్రం మన వెన్నంటే ఉంటాయని, ఉంటున్నాయని అగ్రకులాల చేతిలో ఎప్పుడూ ఎదురు దెబ్బలే అన్నది

**మన ఒంటి నల్లని రంగు**
**ఎంత పాపం చేసుకున్నది**
**బతుకంతా తరిగిపోని చాకిరి**
**..........**
**నంగి నంగి మాట్లాడాలి**
**వంగి వంగి బతకాలి**
**..........**
**వాళ్ల గాలికి నేలశుద్ది అంటూ**
**శుద్ధి ఒంటి కా బుద్ధి కా**

మన ఒంటి నల్లని రంగు ఎంత పాపం చేసుకున్నది నలుపును ఆర్థికంగా లేకపోవడం జీవితమంతా చాకిరీ చేస్తూ బతకాల్సిందే అని అందరికి ఇష్టమైన శరీర రంగు తెలుపు తెల్లగా ఉన్న వాళ్ళంటే అందరికీ ఇష్టం. మనిషి తెల్లగా

**నాకు నచ్చిన పుస్తకం**

ఉన్నా మనసు నల్లగా ఉండవచ్చు. నల్లగా ఉంటే నిచ్చిన మెట్ల కింది మెట్టును ప్రతి ఒక్కరూ తొక్కుతూనే ఉంటారని, అందరి బరువును మోయాలని, నంగి నంగి మాట్లా డాలని వంగి వంగి బతకాలని మూతికి ముంతకట్టుడు నడుముకు తాటాకు కట్టుకొని ఆనాటి సమాజాన్ని ఎత్తిచూపుతూ శుద్ధి ఒంటికా బుద్ధిగా అంటుంది.

ఆడోళ్ళు అంటరాని వాళ్లే లచ్చువ్వా. అని కింది కులం అయితే అంటుకోవద్దు. పై కులమైతే భయంతో తాకొద్దని

దూరాలు గీసి దూరాలు చేసి మనవు మనిషిని పసువును చేసిండని, బతుకుల మీద భూస్వాముల పెత్తనమంటూ సుఖం తెలియని యంత్రాలుగా పనిచేసినా...కూటికి గుడ్డకు ఏడ్చుడేనంటూ బడుగుల బతుకుకు అద్దం పడుతుంది . కష్టజీవికి మోసాలు, వేషాలు, బొంకులు బోర్లిచ్చుడు రావు. చదువుకుంటే వాళ్లను లెక్క చేయరని భయం. మనవి ఏం బతుకులు అటు పశువులం కాము, ఇటు మనుషుల్లో కలవనీయని బతుకులంటూ బాధను వ్యక్తం చేసింది.

**ఈగో లచ్చువ్వ**
**ముంగటున్న తోవ్వనీదే**
**............**
**నిప్పు కణికలం మనం**
**దయిద్దాం దయిద్దాం**
**దయించే శాంతిద్దాం**

**పలుగు పారా పట్టుకునే ముందుకు నడుద్దామని, నిప్పు కణికలమై సమాజంలోని కుళ్ళు తంత్రాలను కాల్చేద్దామని, ముందున్న తోవ్వంతా మనదే అంటుంది.**

**సుడిగాలిని కొంగన కట్టుకున్న**
**కొత్తమనుషులం మనం**
**.........**
**వర్షాలు ముంపులు**
**నీళ్ల నిప్పులు ఎగిరి పడుతున్నాయి**
**............**
**సివంగుల సైన్యం**
**వెల్లువ వెల్లువలై**
**దండోరా మోగిస్తూ**
**జాంబవతివై అడుగులేయి**
**అరుంధతివై పొలికేకెయ్యి**
**చండాలికవై చెలరేగంటూ**

శ్రామిక జీవుల పక్షాన నిలిచి బానిసతనం నుండి బయటకు రమ్మంటూ ,బహుజన రాజ్యం కోసం పాటుపడాలంటుంది. అన్ని కులాల వాళ్లందరం అగ్గి రవ్వలవలె తప్పు చేసిన వాళ్లను నిలదీయాలంటూ... వస్తుంటే ఆ జనం నడకకు భూమి చీలుతున్న చప్పుల్లు. మబ్బులు అదురుతున్న చప్పల్లతో మంచి నీళ్ళబావి కాడికి ,బడిలోకి గుడిలోకి పోవాలని తిరగబడితే ప్రాణం పోతది. లేదా బాంచెతనం పోతది. మన చరిత్ర మనం రాసుకుందాంమటూ అందరూ ఒకటై నడవాలంటూ బహుజన కులాల వారికి పిలుపునిచ్చింది.

**గిదెవలి రాజ్యమే అవ్వా లచ్చువ్వ**
**గీడెవలిది సెల్లుతదే అవ్వ లచ్చువ్వ**
**నువ్వు సర్పంచువైనా ఇంకేదైనా సుతాగా కులాలు కుతకుతో ఉడక యానే లచ్చువ్వ**
**............**
**ఎయిల సాల్ల కానుండి గీ భూమిని**
**ఎవరేలు తాండ్లే అవ్వ**
**..........**
**ఆడిదానికి అక్కు లేదంటరే**
**ఆడది గాడ్డి సాకిరికేనంటరే**
**ఆడ్డి రాజ్యమేలుతే**
**మొగ కులం పెత్తనం యేం గావాల్నే అవ్వా**
**గందుట్ల నీకులమేందే లచ్చువ్వ**
**..........**
**..........**
**మనం ఊళ్లేలితే అవ్వ!**
**ఊరుకుంటారే**
**ఉసరెల్లుల నడుమ బతికి బట్ట కడతామె లచ్చువ్వ**
**.........**
**దోసుకొని దోసుకొని దొంగ దొరలయ్యేటోళ్లు**
**నిన్నునన్ను సుఖంగా ఉండనిస్తారానే తల్లి**
**...........**
**నువ్వు గద్దెనెక్కితే మొగోళ్ల గర్ర తెగిపోదా లచ్చువ్వ**
**ఇది మొగోడి రాజ్యం గాదె తల్లి**
**............**
**అన్నాలపు రాజ్యమే అవ్వగిది**
**పెద్ద సభలను సగం సీట్లు మాకే కావాలని**
**పెద్దసబలల్ల సగం సీట్లు మాకే గావాల్నని**
**పెద్దపెద్ద ఆడోళ్ళంతా లొల్లి చేస్తున్న చేత్రానే లచ్చువ్వ**
**.............**
**ఆడోళ్ళకు అన్నాలం మొగోళ్ళకో నాయమాయె**
**మన కుర్చీలల్ల సూత గాళ్లే సిగ్గిడ్సి కూసున్న రాయే**
**నువుకుర్సీ కుర్సీనెక్కినవని నూకేసి నవ్వులాట లాడాల్నని**
**చదువు రాని నీతోటి సంతకాలు ఒత్తించి కుట్ర చేసినమని**
**మీసాలు తిప్పుతాన్లే తల్లి**
**...............**
**నీ కొంప జప్తు చేసి నిన్ను బజాట్లా పడేస్తాననిరి తల్లి**
**గీడ రౌడీలదే రాజ్యమయిపోయె**
**.............**
**ఈ దైద్రపు దేశంలో నువ్వు దళిత తల్లివే అవ్వ.**
**గందికే లచ్చువ్వ మనం సరాయించుకోవాల్నే**
**సిగలు ముడేసి లడయించుకోవాల్నే**
**గాళ్ళ మొకాల మీద ఊంచుకుంట**
**ఉరుములురుమే నల్లమబ్బు తునకల తునకలోలిగే**
**ఊరంతా వాన గొట్టి కడిగేసుకుంట.**
**.........**
**కర్రెమబ్బులదండై కదులాల్నె లచ్చువ్వ**
**కండ్లు తుడుచుకోవే కయ్యానికి కాలు దువ్వవే**
**ఓ అవ్వ నా లచ్చువ్వ.**

ఆకాశంలో సగమని అవనిలో సగమని చెప్పుకుంటూ.... రాజకీయ రంగంలో మావంతు పాలనను సాగించాలనుకున్న స్త్రీలకు రాజ్యాంగం అందించిన రిజర్వేషన్లతో ఎంత ఎదిగినా కుల,మతాల కుళ్ళులో భార్యలు తల్లులు తోబుట్టువులు రాజకీయంగా ఎదుగుతే మగవాళ్ళు ఇప్పటివరకు పెత్తనాలు చలాయించటం పరిపాటైంది.


నాయకత్వ లక్షణాలున్నా బంధుత్వాన్ని దాటిపోలేని పరిస్థితుల్లో స్త్రీలు ఉన్నారు .ఇక దళితులు వివక్షకు గురవుతున్నారు. కొందరు స్త్రీలు సొంతగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితులలో ఉన్నారు. అలా పేదరికంలో ఉన్న దళిత మహిళ లచ్చువ్వ ఒడ్యారం గ్రామం సర్పంచ్ గా ఎన్నికవ్వడంతో ఆధిపత్య కులపు పురుషులు జీర్ణించుకోలేకపోయారు చదువురాని లచ్చువ్వతో సంతకాలు చేయించి ప్రభుత్వం ఇచ్చిన డబ్బును దుర్వినిచేసిందని వచ్చినఆరోపణలకు తాను ఆ పని చేయలేదని జవాబు ఇచ్చింది.

తను ఎంత చెప్పినా వినకుండా ఆమెకున్న ఇల్లును జప్తు చేసిండ్లు. ఆమెను ఆమెను నమ్ముకున్న వారిని ఆగం చేసిండ్లు. దళిత, బహుజన మహిళలందరిని బాధించే విషయం ఇది.

అందుకే ఆడోళ్ళందరూ లడాయికి పోయి తప్పు చేసినా వారి మొహాల మీద ఉమ్మేసుకుంటూ, ఉరుముల్లా గర్జిస్తూ, నల్ల మబ్బుల్లావర్షిస్తూ చెడును కడిగేయాలంటుంది. అంతేకాదు ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకడుగు వేయొద్దని, కండ్లు తుడుచుకుంటూ కయ్యానికి కాలు దువ్వాలని అన్యాయాన్ని ఎదిరించాలని, మన హక్కులను కాపాడుకో వాలంటూ పిలుపునిచ్చిన గొప్ప కవిత.

స్త్రీలలో చైతన్యం కలగాలని, అన్యాయాన్ని ఎదిరించాలని, కులమతాలకుంటి సాకులను పక్కన పెట్టాలని, పెద్దలను గౌరవించాలని అంది వచ్చిన అవకాశాలను అందిపుచ్చు కుంటూ రాజకీయరణంలో గెలుపు వైపు అడుగు వేయ మన్న లచ్చువ్వ కవితను అందించిన కీర్తిశేషులు అనిశెట్టి రజితక్కకు జోహార్లు.

(కరీంనగర్ జిల్లా ఒడ్యారం గ్రామ సర్పంచ్ లచ్చువ్వను మగ కుల దురహంకారులు దొంగ సంతకాలు ఒత్తించి లక్షలు మింగిందని హింసించిన నేపథ్యంలో 26 -07 -1998 లో జరిగిన విషయాన్నందించిన దీర్ఘ కవత).



-డా॥ బండారి సుజాత
9959771228

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1739వ రోజు ‘గ్రంథాలయం’ అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. ‘గ్రంథాలయం’ అంశంపై వచ్చిన కొన్ని కవితలను ‘నేటి నిజం’ పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

### జ్ఞాన భండారం

అజ్ఞాన తిమిరాన విజ్ఞాన కిరణాలు
ఉపాధికి సోపానాలు
ఆలయంలో దైవం భక్తికి ముక్తికి
గ్రంథాలయంలో దైవాలు భుక్తికి.
పుస్తకాలు నిశ్శబ్దంగా
చేతిలో నవ్వు
మస్తకంలోకెక్కి పలకరింపు
సామాన్యుడి పెన్నిధి
అక్షర జ్ఞాన ముంటే చాలు
నిరక్షర కుక్షికి అక్షయపాత్ర.
ప్రపంచంలోనే అతిపెద్ద లైబ్రరీ ఆఫ్ కామర్స్
భారత్ లోసరస్వతీ మహల్
కలకత్తా నేషనల్ లైబ్రరీ
చెన్నై అన్నాశతాబ్ది లైబ్రరీ
వేటపాలెం గ్రంథాలయం
వాసిలో రాశిలో.
రాజస్థాన్లో భదరియా
భూగర్భ గ్రంథాలయం చూడాలి
సంగారెడ్డిలో అంధులకు ఆడియో లైబ్రరీ
చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో
ఐదు రూపాయల భోజనంతో
కంప్యూటర్ ఇంటర్నెట్ సౌకర్యాలతో
చెట్లకింద కుర్చీల్లో పోటీపడుతూ యువత
ఎస్.ఆర్.రంగనాథన్
గ్రంథాలయ పితామహుడిగా చరిత్రలో
కొచ్చిలో పన్నెండేళ్ల యశోదాషెనాయ్
తొలి పిన్న లైబ్రేరియన్
ఇంటింట గ్రంథాలయం నేడు
పెనుభారం
అందుకే కాలనీలో లైబ్రరీతో
బడిలో పిల్లల కోసం ఓ గదిలో పేపర్లు
పుస్తకాలు ఉంటే
ఫోన్ పక్కకెళ్లు
బుర్రలో ఆలోచనల పరవళ్లు.

-ఎ.రాజ్యశ్రీ

### నిశ్శబ్ద జ్ఞాన మందిరాలు

నిరంతరం ప్రవహించే పుస్తకాల నదిలా
ప్రతి అక్షరంతో మనసును తడుముతూ
అంతులేని విషయాలను పంచే
జ్ఞాన వనంలా
నిత్యనూతన విజ్ఞానంతో
ఎప్పటికీ ఎండని మడుగులా.
జాతీయ జ్ఞానమందిరాలతో
గగనమంత నిబద్ధతతో
ప్రజా గృహాలలో పవిత్ర గదిలా నిలచి
విశ్వవిద్యాలయ విశాల అరలలో ఇమిడి
ప్రతి పుస్తకం, ప్రతి పత్రిక
ప్రతి డిజిటల్ రైటింగ్
యువకుల ఆశల, ఆవిష్కరణకు
మార్గదర్శిలా మారి
నిశ్శబ్దంతో విజయ ఢంకాలను మోగిస్తూ
పాఠాలకు, పరిశోధకులకు బలమై నిలిచి
డిజిటల్ తరంగాలతో వేగంగా ప్రయాణిస్తూ
సమానత్వాన్ని, సామాజిక వాస్తవాలను
వేదవాక్కులను, ప్రజా హక్కులను
పుటలుగా మోస్తూ
పరిశోధన, విద్య, జ్ఞానానికి
అసలైన వేదికలే గ్రంథాలయాలు
పైకి భౌతిక మందిరాలుగా కనిపించినా
ప్రతి మనిషికి ప్రేరణనిస్తూ
ప్రతి ఆవిష్కరణకు దారిచూపిస్తూ
సృజనాత్మకతకు వేదికలామారి
జ్ఞాన సముద్రాలకు తీరాలుగా నిలచే
ధ్యాన మందిరాలే గ్రంథాలయాలు.
ప్రతి పుటలో వెలుగుని దాచుకొని
మనస్సు చీకటిని పారదోలే
లైట్ హౌజులు గ్రంథాలయాలు.

-నాగరాజు చుండూరి

### ప్రగతికి రథచక్రాలు!

వైయక్తిక సామాజిక
దురాచారాలను ఖండిస్తూ
మూర్ఖత్వాలను తరిమి కొడుతూ
ఆధ్యాత్మిక భావాలను మేల్కొలుపుతూ
జీవన మార్గాన్ని నిర్దేశిస్తూ
జాతి పురోగతికి పునాదులు వేస్తూ
జ్ఞాన విజ్ఞాన పథంలో చైతన్యం కల్పిస్తూ
మున్ముందుకు
అడుగులు వేయించే ప్రగతికి రథచక్రాలు.
గత చరితల వైభవాన్ని చాటి చెబుతూ
మహనీయుల ప్రతిభా నైపుణ్యాలకు దర్పణమై
శత్రువులనోడించిన
వీర ధీర సాహస వీరుల కథా చరితమై
సంగీత సాహిత్య సౌరభాలను వెదజల్లుతూ
నవరస నటనా వైదుష్య ప్రతిబింబమై
స్వాతంత్రోద్యమ సారథియై
సాంఘిక సామాజిక రాజకీయ సంక్షేమమై
ప్రతిపాదిత ప్రజా రాజ్యాంగ శాసనమై
హృదయాలను ఆవిష్కరించిన
లిఖిత భాషా స్వరూపం
మనిషిని మహోన్నత శిఖరాలకు చేర్చే
ఆలయం గ్రంథాలయం.

-పి.పద్మావతి

### జాతి సంపద

కవుల భావనల కూర్పు
గ్రంథాలు వెలసిన ఆలయం గ్రంథాలయం!.
భావితరాలకు జ్ఞానపంపిణీ చేసే
విజ్ఞాన భాండాగారం
తరతరాలకు విజ్ఞాన సంపదను
అందించే జాతి సంపద!.
స్థిర, సంచార రూపాల్లో
మారుమూల గ్రామాలకు సైతం
చేరే సుజ్ఞాన వారధి..
మానవులను
సక్రమ విలువల బాటలో
నడిపించు విజ్ఞాన సారథి !.
గాడిచెర్ల, వెంకటరమణల కృషితో
అందరికీ అందిన అక్షరనిధి!.
విద్యార్థులను మేధావులుగా
చైతన్యవంతులుగా
వివేకవంతులుగా తీర్చిదిద్దే ప్రదేశం
విజ్ఞాన సంపన్నులను చేసే జ్ఞానపేటిక!.
గ్రంథి వేసిన తాళపత్ర దశ నుంచి
మట్టిపలకల రాతల నుంచి
ముద్రణా యంత్రంతో
పుస్తక రూపదర్శనమిచ్చి
డిజిటల్ రాతలకెదిగిన
విశిష్ట సదనమది!.
విస్తృత సమాచార జ్ఞానమందించే
విజ్ఞానకడలి
మేధావులు, కవి,
రచయితలను రూపొందించిన
విజ్ఞాన మూలస్థానం!.
వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడి
జీవితాన్ని తీర్చిదిద్దే
గ్రంథాలయం!.
నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించేందుకు
ఎగదోసిన చైతన్య జ్వాల!
ప్రజలను చైతన్యపరచిన
సురవరం మాడపాటి రాతల
సామాజిక, చారిత్రక ప్రదేశం
సాంస్కృతిక పునరుజ్జీవనాన్నందించినదది!.

-చంద్రకళ దీకొండ

### ఉపయోగకరం

ఒకప్పుడు తాళపత్రాలపై రాతలు
భద్రంగా నిక్షిప్తం
కాగితం, ముద్రణా యంత్రాల ఆవిష్కరణ
యంత్రాలతో పుస్తకాల ముద్రణ
గ్రంథాలను భద్రపరిచేది
గ్రంథాలయమన్నారు.
గ్రంథాలయంలో పుస్తకాలను భద్రపరచగా
భావితరాలకు పుస్తకాలను అందించగా
విద్యార్థులు
గ్రంథాలయాలను ఉపయోగించగా
ఉపాధ్యాయులకు కూడా ఉపయోగం
గ్రంథాలయం అందరికీ ఉపయోగం
విజ్ఞాన వినోదాల పెంపు
పైగా ప్రశాంతత
గ్రంథాలయాల్లో ఇంటికి తీసుకెళ్లి
చదువుకునే ఏర్పాట్లు కూడా
తక్కువ ఖర్చుతో ఎక్కువ విజ్ఞానం
దిన, వార, మాస పత్రికలతో
అపరిమిత విజ్ఞానం
అంతులేని ఆనందం.

-డా.షహనాజ్ బతుల్

### జ్ఞానార్థులకు ప్రసాదం

గ్రంథం జ్ఞానాన్ని పంచే పేటిక
జ్ఞాన సముపార్జనకు గ్రంథాల చేరిక
పలు గ్రంథాలను సేకరించి అమర్చి
విద్యా జ్ఞానార్థులకు వీలు కల్పించే
గ్రంథాల నిలయం గ్రంథాలయం.
వివిధ రంగాల విశేష
ప్రాచీనాధునిక విషయాల
గ్రంథాలను, శాస్త్రాలను
సులువుగా తాత్కాలిక పద్ధతిన లభ్యపరిచే
ఆదరణీయ పవిత్ర స్థలం గ్రంథాలయం.
గ్రంథాలే దైవ స్వరూపాలుగా
పుస్తక రూపాల వెలసిన నిలయం
ఆరాధనాభావంతోనే
గ్రంథాలయాలను దర్శించాలి.
ప్రతీ గ్రంథ పఠనం
ఆలయ ప్రసాదంగా స్వీకరించాలి.
ప్రతి గ్రంథాన్ని పవిత్రంగా చూస్తూ
క్రమశిక్షణతో వినియోగించాలి
ప్రతి గ్రంథం మరెందరికో ఉపయోగపడేలా
శుభ్రత, సంరక్షణలతో వినియోగించాలి.
గ్రంథాలయం సరస్వతీ నిలయం
ఆరాధ్య సేవతో గ్రంథాలయ పరిసరాల్లో
నిశ్శబ్దం, ప్రశాంతత పాటించాలి.
అవసరం లేని గ్రంథాలను
గ్రంథాలయాలకు అర్పించాలి.
ఎందరెందరో సహృదయతతో
సమర్పించిన గ్రంథాల ఆలయమే
మనం చూసే గ్రంథాలయం..
గ్రంథాలయాలుదేశ ఉన్నతికి సోపానాలు,
గ్రంథాలయానికి ప్రత్యామ్నాయం లేదు
గ్రంథాలయాల సంరక్షణ
కావాలి మనందరి సంకల్పం.

-రాజప్ప

### మరో గ్రంథాలయోద్యమం

పుస్తకాలు
చరిత్రకు వారధులు
సంస్కృతికి, కళలకు
విజ్ఞానానికి సాక్షాలు
ఉన్నాడో లేడో తెలియని దేవాలయాలకు
రోజూ వెళ్లకున్నా దేవుడు క్షమిస్తాడు
గ్రంథాలయాలకు మాత్రం
ప్రతి రోజూ వెళ్లడం
విజ్ఞానాన్ని పెంచుకుంటూ
అభివృద్ధి చెందడం
మానవ వికాసానికి చేస్తుంది దోహదం
ప్రపంచంలో భిన్న భాషలు సంస్కృతులు
తెలుగు ప్రాంతాల్లోనూ
ఒకే అర్థం ఇచ్చే విభిన్న పదాలు ఎన్నో
దినపత్రిక భాష టీవీల భాష
ప్రస్తుత స్మార్ట్ ఫోన్ యూట్యూబ్ ల భాషతో
ప్రాంతీయ భాషాపదాలకు మాండలికాలకు
క్రమేణా తగ్గుతున్న వైవిధ్యం
ప్రపంచ వ్యాప్తంగా చూసుకున్నా
ప్రత్యేకించి భారతదేశం గురించి చెప్పాలన్నా
పూర్వం ధనికులకే చదువు అందుబాటులో
తెలంగాణ గ్రంథాలయోద్యమ నాయకుడు
వట్టికోట ఆళ్వారు స్వామి అవిరళ కృషితో
ప్రతి చోటా
గ్రంథాలయాల ఏర్పాటు జరిగినా
స్మార్ట్ ఫోన్లకు బానిసలైన యువత
గ్రంథాలయాల వైపు చూడడమే లేదు
గ్రంథాలయ ఆవశ్యకతపై
మరోసారి ప్రారంభమైన
గ్రంథాలయోద్యమానికి
ప్రభుత్వ సహకరించాలి
గ్రంథాలయాలకు తగిన నిధులిచ్చి
కొత్త ఊపిరులూదాలి
యువత భవిత దేశానికి భరోసా నిచ్చేలా
అందరూ మెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

-నాగిరెడ్డి అరుణజ్యోతి

# పోదన-వేములవాడ చాళుక్య రెండవ అరికేసరి ప్రజాపాలన, శౌర్య ప్రతాపాలకు అద్దం పట్టిన నవల!

కరీంనగర్ కు చెందిన డా.మలయశ్రీ అంటే ఉభయ తెలుగు రాష్ట్రాలలోని సాహిత్య లోకంలో తెలవని వారెవరూ లేరు. పద్య, నాటక, నవల రచయితగానే కాక, వివిధ ప్రక్రియల్లో ఆరితేరిన వారు. అంతేకాక కాకలు తీరిన చారిత్రక సాహిత్య కారుడిగా ఎదిగిన తీరు అద్భుతం. వీరి 146వ చివరి రచనగా రెండవ అరికేసరి నవలను రాసి ఏప్రిల్ 10న స్వల్ప అనారోగ్యంతో 86వ ఏట తనువు చాలించారు. వారి మృతి సందర్భంగా నివాళిగా నా ఈ పుస్తక సమీక్ష .వివిధ చోట్లనే కాక, పలు విశ్వవిద్యాలయాలలో జరిగిన సాహిత్య, చరిత్ర సదస్సుల్లో పలు పత్ర సమర్పణలు చేశారు. శతాధిక గ్రంథకర్తగానే కాక,రమారమిగా 146 గ్రంథాలను రాశారు. వీరు ఏప్రిల్ 10 న స్వల్ప అనారోగ్యంతో కరీంనగర్ లో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వీరికి 86 సంవత్సరాలు. సాహిత్య వ్యాసంగాలతోనే వారు వృద్ధాప్యాన్ని అవలీలగా జయించారు. వారి భార్య భారతమ్మ గారు 2021 సెప్టెంబర్ 9 న కరోనా సమయంలో అస్వస్థతరాలై చనిపోయారు. భార్య చనిపోయిన వ్యథతో నాలుగు అయిదేళ్ళు బతకగలిగారు.

ప్రస్తుతం వీరు గత ఏడాది మే,2025 లో రాసిన నవల వేములవాడ, పోదన చాళుక్య రాజ్యాలకు చెందిన రెండవ అరికేసరి నవలను 146 వ పుస్తకంగా రాశారు. ఇది వీరి ఆఖరి నవలగా చెప్పవచ్చును. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెయ్యేళ్ళ సాహిత్యంపై 1995లో పిహెచ్ డీ అంశంగా పరిశోధన చేసి, సిద్ధాంత గ్రంథం వెలువరించారు. చివరి గ్రంథంగా రెండవ అరికేసరి నవల 150 పేజీల్లో పూర్తి చేశారు. 150 గ్రంథాలను రాయాలని వారి టార్గెట్ గా ఉండే. చారిత్రక అధ్యయనాలలో మేటి. బౌద్ధంలో ఆరితేరిన వారు. బౌద్ధం ఆధారంగా వీరు రాసిన శాంతిపథం నాటకం 1974 ప్రాంతాలలో ఇంటర్మీడియట్ నాన్‌డిటేల్ గా ఉండే. నాస్తిక వాదంలో దిట్ట. భౌతిక వాది అనే పత్రిక ను నడిపారు. దాదాపుగా 70 ఏళ్ల సాహిత్య జీవితం వారిది. ఇల్లందల, బిఎస్. శాస్త్రి, అదవి బాపురాజు, ఆచార్య మాదిగొండ శివప్రసాద్, విశ్వనాథ సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం పిళ్ళై లాగా వీరికి చారిత్రక నవలా రచన అబ్బింది. అలాగే రాచకొండ రాజులు, కాకతీయులపై నాలుగు నాటకాలు రాశారు. కాకతీయుల కాలం నాటి సామాజిక జీవితం అనే పరిశోధక గ్రంథం తెలుగు అకాడమి వారి పోటీలలో ఎన్నికైంది. వేలాది సభల్లో పాల్గొని ఉపన్యాసాలు చేశారు. వివిధ విశ్వవిద్యాలయాలలో పత్ర సమర్పణలు చేశారు. సొంతంగా నవ్య సాహిత్య పరిషత్ ను కరీంనగర్ లో ఏర్పాటు చేసి, వందలాది మంది కవులను, రచయితలను సన్మానించారు. అంతేకాక తెలుగువిశ్వ విద్యాలయం నుండి పురస్కారాన్నందుకొన్నారు. అలాగే తెలుగు అకాడమి, ఇతర ఎన్నో సాహిత్య సంస్థలచే పురస్కారాలు అందుకొన్నారు.

ఇహ వీరి నవల రెండవ అరికేసరి వెడితే....దక్షిణ భారత దేశ చరిత్రలో చాళుక్య రాజులు ఎంతో ప్రసిద్ధి గన్నారు. వీరు బాదామి, వేములవాడ, కళ్యాణి, ముదిగొండ తదితర చాళుక్యులుగా వివిధ శాఖలుగా, తెగలుగా ఉంటూ ఆ వారి ఊర్ల పేర్లతోనే పిలువబడ్డారు. గుజరాత్ లోని సోలంకి రాజులు కూడా చాళుక్యులే. ఇలా వీరు రకరకాల చాళుక్య రాజ వంశాలను ఇందులో ప్రస్తావిస్తూ, భావి చరిత్రకారులకు చాళుక్యుల చరిత్రపై ఒక సమగ్ర అధ్యయనం చేయడానికి అనువుగా లేని క్లిష్టమైన దారులను సులభతరం చేశారు. చాళుక్యుల ప్రాప్తి స్థానం కర్ణాటక రాష్ట్రం. అయితే ఈ చాళుక్యుల తెగల్లో వైరాలు, స్నేహాలున్నాయి. అయితే వైరాలే ఎక్కువ. మైత్రీభావాలు అంతంత మాత్రమే. వేములవాడ (పోదన) చాళుక్యులు క్రీ.శ. 750-973 వరకు సుమారు 273 సంవత్సరాలు పాలించారు. తొలుత (పోదన)బోధన్ రాజధానిగా, తదుపరి వేములవాడ రాజధానిగా పాలించారు. ఇలా వీరిని బోధన్ చాళుక్యులని, వేములవాడకు రాజధానిని మార్చారు గనుక వేములవాడ చాళుక్యులు అని పిలుస్తారు. చరిత్రకారులైతే వేములవాడ చాళుక్యులేనని పిలుస్తారు.

ఎందుకంటే వీరి శాసనాలు అన్నీ వేములవాడ, ఇక్కడి పరిసరాలలోనే 90 శాతం వారకు లభ్యమయ్యాయి. కనుకనే వీరిని వేములవాడ చాళుక్యులేనని చరిత్రకారులు ఎక్కువగా పిలుస్తారు. వీరు రాష్ట్రకూట రాజులకు సామంతులుగా పనిచేసినా, వారితో వియ్యాలు పొందారు. రాష్ట్రకూటులు బాదామి చాళుక్యులకు సామంతులుగా పనిచేశారు. తర్వాత వారిని ఓడించి సర్వస్వతంత్రులైనారు. కర్ణాటకలోని భీమానది తీరాన ఉన్న గుల్బర్గా సమీపంలోని మాన్యఖేటం నగరాన్ని రాజధానిగా చేసుకొని రాష్ట్రకూటులు పాలించారు.

వేములవాడ చాళుక్యులు సామంతరాజులైనా, తమ అధిపతులైన రాష్టకూటులతో రక్త సంబంధపు చుట్టరికాలను కొనసాగించారు. రచయిత డా. మలయశ్రీ గారు కరీంనగర్ నగర్ వాసి కావడం వల్ల వేములవాడ, బోధన్ చాళుక్యుల పాలనాంశాలు, చరిత్రాంశాలతో దగ్గరి పరిశోధక, అధ్యయన సంబంధాలున్నాయి. వీరి గత రచనల్లో చాళుక్యుల అంశాల ప్రస్తావనలు పలు సార్లు కొనసాగించడం వల్ల, వేములవాడ చాళుక్యులలో ప్రసిద్ధుడైన రెండవ అరికేసరి (క్రీ.శ. 930-955) పాలనా దక్షత, అప్పటి రాజకీయాలు, యుద్ధాలు, కుటుంబ వ్యవహారాలు, రాష్ట్రకూట రాజులతో ఉన్న సంబంధాల గూర్చి అంశాల ఆధారంగా రెండవ అరికేసరి నవలను సమగ్రంగా తీర్చి దిద్దుతూ రాశారు.

నవల అంటే కొంత ఊహ జనిత సన్నివేశాలు, కల్పనలకు అవకాశా లున్నప్ప టికినీ, 85 ఏండ్ల వయస్సులో డా.మలయశ్రీ ఈ నవలను ఓపిక చేసుకొని, సాహసంగా రాశారు. చారిత్రకాంశాల ఆధారంతో ఈ నవలను కొంత తన స్వేచ్ఛాయుత భావనలను చొప్పించి చక్కగా రాశారు. ఇదొక పరిశోధక చారిత్రక కావ్యమని పరిగణీంచవచ్చును. వేములవాడ చాళుక్యులలో ముఖ్యుడైన రెండవ అరికేసరిపై ఉన్న మమకారాన్ని, ఆకాంక్షలను నవల రాయడం ద్వారా ప్రగాఢంగా ప్రకటించుకొన్నారు. నవలను 22 అధ్యా యాలతో, 160 పేజీలలోఅనుబంధంగా రెండు శాసనాలు ముగింపులో వేసి ముగించాడు. నవల దార రమణీయం, కమనీ యంగా ఉంది. అదొక చారిత్రక లోకంలోకి పాటకులు వెయ్యేళ్ళ వెనక్కి వెడుతారు.రెండవ అరికేసరి వేములవాడ ను రాజధానిని చేసి పాలించారు. అరికేసరి ధీరోదాత్తత పై ఈ నవల చక్కగా రాయబడింది. డా.మలయశ్రీ చారిత్రక శైలి అద్భుతంగా కనిపిస్తుంది. బోధన్ వీరి మూల స్థానమైనా ఎక్కువగా వీరిని వేములవాడ చాళుక్యులుగానే చరిత్ర పరిశోధకులు పిలుస్తారు. వేములవాడ చాళుక్యులపై పలువురు పరిశోధనలు సాగించారు. వేములవాడకు తరలి రావడం, ఎప్పుడు? ఎందుకోసం తరలి వచ్చారనే విషయంలో ఎవ్వరూ సరైన కారణాలు చెప్పలేక పోతున్నారు. తగిన ఆధారాలు చూప లేక పోతున్నారు. వేములవాడ రాజధాని మార్చుకొనే విషయంలో పలు వివాదాలు ఉన్నాయి. రెండవ అరికేసరి కాలానికి ముందే బోధన్ చాళుక్యులు తరలి వచ్చారని ప్రఖ్యాత చరిత్రకారులు డా. నేలటూరి వెంకటరమణయ్య తో సహా, పలువురి చరిత్రకారుల రచనల్లో స్పష్టంగా ఉన్నాయు. ఏది ఏమైనా ఈ అంశం నేటికినీ వివాదాస్పద అంశంగానే మిగిలి పోయింది. వేములవాడ చాళుక్యులకు మాత్రం తొలుతగా బోధన్ తో సంబంధాలున్నాయన్న విషయమైతే వాస్తవం. ఎవ్వరూ కాదనలేని అంశమే. డా.మలయశ్రీ మాత్రం ఎలాంటి వివాదాల జోలికి వెళ్లకుండా బోధన్, వేములవాడ చాళుక్యులని స్పష్టం చేశారు.


వేములవాడ చాళుక్యులలో ముఖ్యుడైన రెండవ అరికేసరి క్రీ.శ. 930-955 మధ్య 25 సంవత్సరాలు రాజ్యపాలన చేశారు. రాష్ట్రకూట రాజులకు సామంతునిగా ఉన్నా వీరి పాలన సర్వస్వతంత్రగానే కొనసాగిందని చెప్పవచ్చును. ప్రముఖ చరిత్రకారులు మత్తి భానుమూర్తి ఇలా కాకతీయ చక్రవర్తి గణపతి, గజ సేనాని జాయపపై రెండు నవలలు రాశారు. ఎందరెందరో చారిత్రికాంశాలపై నవలలను వాస్తవాలకు దగ్గరగా రాశారు.వేములవాడ, బోధన్ చాళుక్యులుగా పిలువబడుతున్న ఈ చాళుక్యులను 1952లో దక్కన్ తెలంగాణా సమయంలో పరిశోధించిన ప్రముఖ చరిత్ర పరిశోధకులు డా. నేలటూరి వెంకట రమణయ్య గారైతే వేములవాడ చాళుక్యులు అంటూ ఒక వందపేజీల మోనోగ్రాం రాశారు. అప్పటి హైదరాబాద్ దక్కన్ ప్రభుత్వ పురావస్తు శాఖ వారు ఈ పుస్తకాన్ని ఆంగ్లంలో ప్రచురించారు. ఇటీవలే ఈ పుస్తకం రెండవ ముద్రణకు తెలంగాణా ప్రభుత్వ పురావస్తు శాఖ వారి ఆధ్వర్యంలో కూడా నోచుకొంది. ఈ పుస్తకం తెలుగులో అనువాదం కావాల్సి ఉంది. బిఎస్. శాస్త్రి గారైతే వేములవాడ క్షేత్రంలో 1990 ప్రాంతాలలో ఒక నెలరోజుల క్యాంపు వేసి, వేములవాడ-చరిత్ర శాసనములు అనే గ్రంథాన్ని విపులంగా రాశారు.

ఈ నవల రాయడానికి రచయిత డా.మలయశ్రీ గారు పలు ఆధార గ్రంథాలను పరిశీలించారు. కన్నడ ఆదికవిగా పేరొందిన పంప మహాకవి కన్నడం లో రాసిన విక్రమార్జున విజయం, డా. పివి.పరబ్రహ్మశాస్త్రి గారు రాసిన కరీంనగర్ జిల్లా శాసనములు, రెండవ అరికేసరి వేయించిన శాసనాలు, కొల్లిపర తామ్ర శాసనం, వేములవాడ,భోధన్ దేవాలయాలు, రాగిరేకులు,కోటలు, చారిత్రక చిహ్నాలను, నిజామాబాద్ చరిత్ర పరిశోధకులు గిరి నాగభూషణం రాసిన చరిత్రలో నిజామాబాద్, విజ్ఞాన సర్వస్వాలు, తెలుగు కవిత్రయం రాసిన రాసిన మహాభారతం, డిగ్రీ, పిజీ చరిత్ర గ్రంథాలను, కన్నడ గ్రంథాలను రెఫరెన్స్ గా వాడుకున్నారు.

తెలుగు ఆదికవి నన్నయ్యభట్టు కన్నా పంపడు ఒక వంద సంవత్సరాలు వెనుకకాలానికి చెందిన వారు. రెండవ అరికేసరి పంపమహాకవికి ఆశ్రయం ఇచ్చాడు. రాష్ట్రకూట అమోఘవర్ష-2, రెండవ అరికేసరి చివరి సన్నివేశాలను రూపకల్పనగా నవలలో చేర్చినట్లు రచయిత స్వయంగా చెప్పుకొన్నారు. పంప మహాకవి తమ్ముడు జిన జినవల్లభుడు వేసిన కురిక్యాల బొమ్మలమ్మగుట్ట త్రిభాషా శాసనం వల్ల వేములవాడ చాళుక్యరాజుల పరిపాలన, వంశావళికి సంబంధించిన అంశాల వల్ల, అనేక అనుమానాలకు తెరపడిందని రచయిత చెప్పుకొచ్చారు. ఇది రెండవ అరికేసరి కాలం నాటి పాలనా విధానాలను, వంశావళిలను చెప్పే త్రిభాషా శాసనమిది. ఈ నవలకు వెన్నుముకగా ఈ శాసన అంశాలు, కన్నడ పంపభారతం తన నవలా రచనకు కీలకంగా ఉపయోగపడ్డాయని రచయిత చెప్పుకొచ్చారు.

క్రీ.శ. 945 నాటి బొమ్మలమగుట్ట వద్ద ఉన్న త్రిభాషా శాసనం లో మూడు తెలుగు పద్యాలు ఉన్నాయి. అవి తెలుగుకు జాతీయ ప్రాచీన హోదా రావడానికి ఉపయోగపడ్డాయి. ఈ పద్యాలను నవలలో రాశారు. అంతేకాక కన్నడ, సంస్కృత పద్యాలను సైతం రచయిత నవలలో పలు సందర్భాలలో చొప్పించారు. రచయిత పుస్తకం చివరలో అనుబంధం శీర్షికలో తన అభిప్రాయాన్ని రాస్తూనే, కొల్లిపర తామ్రశాసనం, రేపాక శాసనాన్ని ప్రచురించారు.

రచయితది 70 ఏళ్ళ సాహిత్య జీవనం. 85 వరకు వయస్సు పై బడినా ఇంకా రచనలు చేస్తున్నారు. వీరు 1998లో 27 ఏండ్ల కిందట జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగ విరమణ చేశారు. 45 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితం వీరిది. అదికూడా ఒక రికార్డుగానే పరిగణింపాల్సి ఉంది. వేములవాడ చాళుక్యులపై ఇది మొట్ట మొదటి నవల. ఇంతవరకు ఈ ఇతివృత్తాన్ని తీసుకొని ఎవ్వరూ రాయలేదు. రచయిత ఈ నవలలోని సన్నివేశాల రూపకల్పన,పాత్ర పోషణ,కథానిర్వహణలో తగిన శ్రద్ధ తీసుకొన్నారు. కొన్ని సార్లు రచన జటిలంగా మారిందని చెప్పుకొన్నారు. పంప భారత విశేషాలు, వైశ్య కవి రేచన మల్లయ్య, జైన తీర్థంకర విశేషాలను రచయిత నవలలో సందర్భోచితంగా చొప్పించారు. ఎన్ని కష్టాలెదురైనా, రచనలో గజిబిజి సమస్యలు వచ్చినా ఈ నవలను చిట్ట చివరి నవలగా పూర్తి చేయడం డా. మలయశ్రీ గారిని అభినందించి తీరాలి.వివిధ శాసనాలలోని సంస్కృత శ్లోకాలు, అందులోని గీత శ్లోకాలను సైతం ఉదహరించారు. పదవ శతాబ్దానికి పూర్వపు రచనలు, తదనంతర రచనలపైనే రచయిత చాలా మటుకు కేంద్రీకరించి నవల రాశానని నొక్కి, ఇతర రచనలను అవసరమున్నంత వరకు వాడుకొన్నట్లు చెప్పుకొన్నారు. ఆనాటి యుద్ధతంత్రాలను, రాజ్యపరిస్థితులను, సరిహద్దు రాజ్యాల కలహాలు, గొడవలు, యుద్ధ భయాలు, రాచరికపు కుట్రలను, జైనమత, శైవమత్ర ప్రాబల్యాలను, ఆనాటి రాజ్యాల పాలనా తీరు, రాణివాసం, అంత:పుర విశేషాలను, ఆ కాలపు సాహిత్యం, రచనల తీరును, ఆహార పదార్థాలు, వస్త్రాలంకరణ, వాయిద్యాల రీతులను, సామాన్య




డా.మలయశ్రీ గారు
ఈ నెల 10న కరీంనగర్ లో
వయోభారంతో మృతి చెందారు.
వారి మృతికి పలువురు
సాహిత్యకారులు, కవులు, రచయితలు
నివాళులర్పించారు.

ప్రజల జనజీవనాన్ని, సంస్కృతులను చక్కగా రికార్డు రాశారు. పదవ శతాబ్దానికి పూర్వముండే రీతిలో జాగ్రత్త పడుతు పాటకులకు వ్యాఖ్యాన పరంగా వివరించుకొంటూ పోయారు. ఈ నవలను ఆసక్తికరంగా మలచడానికి అవసరమైన మసాలా దినుసులను వాడారు. నవలను రూపొందించడంలో మిక్కిలి శ్రద్ధాశక్తులు తీసుకొన్నారు.

నవలలో ఆయా తొలి రాజుల విశేషాలను చర్చించారు. బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ, పోదన(బోధన్) చాళుక్యరాజుల వంశావళీలను ఇచ్చారు. అలాగే వీరు అంతకు ముందు రాసిన రాచకొండ చరిత్రపై ఎవ్వరూ నవలా రూపం తేలేదు. కాకతీయుల కాలం అనంతరం రాచకొండ రాజులు పాలించారు. ఇలా సోలో ఐకానిక్ నవలా రచయితగా డా. మలయశ్రీ ముద్రపడ్డారు. ప్రముఖ సాహిత్యకారుడు, డా.మచ్చ హరిదాస్ (కరీంనగర్) ఈ నవల వెలువడడానికి కీలక పాత్రనే పోషించారు. రాత ప్రతిని డిటిపి, ప్రూఫ్, ముద్రణా వ్యవహారాలు స్వయంగా చూసుకొన్నాడు. అందుకే నవలా రచనకు సహకరించిన డా. మచ్చ హరిదాస్-భారతి దంపతులకు రచయిత డా. మలయశ్రీ ఈ పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. తెలుగు సామెతలు, పదబంధాలు, నుడికారాలు, పొడుపు కథలు, ఉయ్యాల పాటలు, కన్నడపదాలు నవలలో వాడారు. ఇలా తెలుగు భాషా సొగసులకు శ్రీకారం చుట్టారు. ఆ నాటి సమాజంలోని చదరంగం, పులిజూదం వంటి ఆటలు, పూల దండల అల్లిక కూర్పు, పంటలు, వంటలు, నగలు, ఇతర పనిముట్లు, కంచు, ఇత్తడి పాత్రలు, మట్టి పాత్రల వంటివి చక్కగా వివరించారు.

ప్రారంభ పేజీల్లోనే పోతలి నగరంలోని (బోధన్) నవలా హీరో రెండవ అరికేసరి కళ్యాణం జరిగిన తర్వాత, తన సొంత ఊరు పోదనకు వచ్చే తిరుగు ప్రయాణపు ఊరేగింపుతో నవల ప్రారంభమవుతుంది. అది రాచవారి ఊరేగింపు, వరుడొక్కడు, వధువులిద్దరు అని వర్ణిస్తూ పోతాడు. పాటకులకు ఎక్కడా ఎలాంటి అనుమానాలకు తావులేకుండా రచనా సంవిధానం కొనసాగింది. శాతవాహన, విష్ణుకుండిన రాజుల తర్వాత బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, వీరి సామంతులు బోధన్, (వేములవాడ) చాళుక్యులు ఎలా అధికారంలోకి వచ్చారో వివరిస్తాడు. ఇలా పూర్వ చరిత్ర అంశాల్లోకి అవసరమున్నంత మేరకే వెళ్లారు. రెండవ అరికేసరి బాల్యాన్ని అమ్మమ్మగారి ఇల్లు కర్ణాటకలోని మాన్యఖేటం రాజధానిలో గడిపిన విధాన్ని స్థూలంగా వివరిస్తారు. అప్పుడు రాష్ట్రకూట చక్రవర్తి మూడవ ఇంద్రవల్లభుడు పాలిస్తున్నాడు.

హీరో ఇద్దరి మరదళ్ళు రేవక నిర్మాడి, లోకాంబికల ప్రణయాల సన్నివేశాలను రకరకాలుగా వివరిస్తారు. ఇద్దరి మరదళ్ళ మధ్య సాగిన దాగుడు మూతల చిలిపి ప్రణయాల్ని, మరదళ్ళ సఖ్యతను సకారాత్మకంగా చెబుతారు. ఆనాటి ప్రేమలు, వన విహారాలు, రాజమహల్ వర్ణనలు, శృంగార వర్ణనలు, చిలిపి ముచ్చట్లు, ముత్తాత కృష్ణ వల్లభుడు కట్టించిన ఎల్లోరా గుహల సందర్శనం, ఈ గుహల్లోని కైలాస నాథ దేవాలయపు శిల్ప చాతుర్యాలను, రెండవ అరికేసరి కన్నడ, సంస్కృత భాషల్లో సాగిన విద్యాభ్యాసం తదితర అంశాల్ని వివరిస్తాడు. మేనమామ కూతురు రేవకనిర్మాడి, మరో మరదలైన లోకాంబికతో కలిసి తిరిగిన దోబూచులాటల్ని చక్కగా పొందుపరిచాడు. లోకాంబిక ఆత్మహత్యా యత్నాన్ని ప్రస్తావిస్తూ, ఇద్దరు మరదళ్ళను హీరో అరికేసరి పరిణయమాడేలా కథను మలుపు తిప్పారు.

రెండవ అరికేసరి జననీ జనకులు జాకవ్వ-నరసింహవర్మలు. జాకవ్వ రాష్ట్రకూట చక్రవర్తి మూడవ ఇంద్రవల్లభుడి సోదరి. ఆ కాలంలో చీరలు తప్ప రవికలు లేవు. ఇలా రచన పలు ప్రత్యేక అంశాల వివరణలతో ముచ్చట గొల్పేలా నడిపించడంలో రచయిత తీసుకొన్న జాగ్రత్తలు ఇంపుగా, సొంపుగా ఉన్నాయి. రెండవ అరికేసరి కళ్యాణం నన్నెచోదుని కుమార సంభవంలోని 12 వ శతాబ్దపు శివపార్వతుల కళ్యాణం, 13 వ శతాబ్దిలోని తిక్కన భారతంలోని ఉత్తరాభిమానుల కళ్యాణం, 14వ శతాబ్దపు మడికె సింగన రచన పద్మపురాణంలోని రుక్మిణీ-కృష్ణుల పెళ్ళి, 16వ శతాబ్దంలోని శ్రీకృష్ణదేవరాయలు రాసిన ఆముక్తమాల్యదలోని గోదారంగనాయకుల కళ్యాణం వలె ఉన్నాయని పోల్చుతూ రసరమ్యంగా చెప్పారు.

మద గజాలు, గుర్రాల దండు, బండ్లు, పల్లకీలు, సైనిక పటాలం, దాస దాసీ జనం రాష్ట్రకూట రాజధాని మాన్యఖేటం నుండి వెంట రాగా, తెలుగు నాటి అస్మక, నేటి సాపాద లక్ష రాష్ట్రకూట మహా సామంత పోదన చాళుక్య రాజధాని నగరానికి క్షేమంగా చేరుకొన్నారు. అదే ఈ పెళ్ళి ఊరేగింపు. రాత్రి కావచ్చింది. నూనె ఆముదం దివిటీలు వెలుగుతున్నాయి. తూర్యాలు మోగుతున్నాయి. అప్పటి కాలంలో గడియారాలు లేవు.



- సంకేపల్లి నాగేంద్రశర్మ,
సెల్: 80748 26371.

ఉన్నవి నీడ, ఇసుక, నీటి గడియారాలు. రాజప్రసాదం మొగసాలపై గంటల వాయింపు. జాము రాతి వేళ ఊరేగింపు పోదన నగరానికి చేరుకొంది. సంతోషంగా వధూవరుల భవన ప్రవేశం జరిగింది.

పెళ్ళికి మరుసటి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. బుర్రకథ, నృత్యగానాలు ఏర్పాటు చేశారు. చాళుక్య పూర్వ భూపతుల చరిత్ర అంశంపై బుర్రకథగానం జరిగింది. బుర్రకథకు పూర్తి రూపం అప్పటికీ రాలేదు. కథకులు కన్నడ వాళ్ళు. కన్నడ పదాలు రచయిత అక్కడక్కడా వాడి నవలకు సరికొత్త చమత్కారపు అందాలు తెచ్చారు. .

ఇలా రెండవ నరసింహవర్మ హీరో రెండవ అరికేసరికి తండ్రి అయ్యాడని, అలా ముత్తాత పేరును పెట్టియుంటారని రచయిత చెబుతాడు. రెండవ అరికేసరి తండ్రి నరసింహవర్మ ధర్మపురి క్షేత్ర సందర్శన, రెండవ అరికేసరి వేములవాడ క్షేత్ర (లేంబాలవాటిక) సందర్శనలు నవలలో సందర్భానుసారంగా చర్చకు వస్తాయి. ఇద్దర భార్యల ప్రణయాలు, ప్రణయ కలహాలు, పూలచెండు పరాచకాలు, శోభనం, వర్షా కాల ఆరంభంలో పోదలిలోని చక్రేశ్వరీ దేవి అమ్మవారి గుడికి బోనాల సమర్పణ అంశాలు కథలో ప్రస్తావించబడతాయి. తెలంగాణాలో ఇతర ప్రాంతాలలోని పోచమ్మ మొదలగు గ్రామదేవతల పేర్లు, ప్రాముఖ్యతల్ని వివరించారు. చాళుక్య రెండవ నరసింహవర్మ పోదనకు మహా సామంత రాజుగానే ఉంటూనే, అటు రాష్ట్రకూట బావమరిది ఇంద్రవల్లభ చక్రవర్తికి పాలనలో సహకరిస్తూ ఉండేవాడు.

ఒండవ అరికేసరి తల్లి-తండ్రులు జాకవ్వ-నరసింహవర్మ పాత్రలు నవలలో ప్రధానంగా చోటు చేసుకొంటాయి. జాకవ్వ, నరసింహవర్మ చాళుక్యులలో ఏడవ రాజు. పోదన జిన చక్రేశ్వరి భక్తురాలు. ఆ కాలంలో జైనం ఉన్నా, వైదికమే ఎక్కువగా ఉందని రచయిత స్పష్టపరిచారు. ఆమె ఒంటి నిండా నగలతో, ఆకుపచ్చ ఎర్ర అంచు గోచికట్టు, గళ్ళ చీరతో లేంబులవాడ(వేములవాడ) రాజరాజేశ్వరీ దేవి లాగా ఉందని వర్ణించారు. నరసింహవర్మ వీరత్వం, పాలన, ఆయన మరణం, రెండవ అరికేసరి పట్టాభిషేకం, యువరాజు పుత్రసంతానం, ప్రజాపాలన, రెండవ అరికేసరి యుద్ధాలు, మంత్రి పెద్దనార్యుని కోరికపై వేములవాడ ఆదిత్యేశ్వరాలయ నిర్మాణం, శాసనం రాయించుట, పోదన నుండి వేములవాడకు రాజధాని మార్పు, రాష్ట్రకూటుల మధ్య తిరుగుబాట్లు, ఇంద్రవల్లభుని ఆకస్మిక మరణం, పంపమహాకవి ఆస్థాన విద్వాంసుడిగా నియామకం, స్నేహితం, అనుబంధం మొదలగు అంశాలతో నవలలో చోటు చేసుకొన్నాయి.

రాష్ట్రకూట రాజరికపు మార్పులు, ఇటు పోదన,వేములవాడ చాళుక్యరాజ వంశాలలో జరిగిన మార్పులను చర్చిస్తూ నవల చివరి వరకు సాగుతుంది. పోదన చాళుక్యులలో రెండవ అరికేసరి తండ్రి నరసింహభూపతి మరణం, ఎనిమిదవ రాజుగా రెండవ అరికేసరి పట్టాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు, దానాలు, దాన శాసనాలు, రాజధాని వేములవాడకు మార్పు, అరికేసరి యుద్ధాలు, పంపకవి ప్రవేశం, పంపడి తమ్ముడు జినవల్లభుడి రాక, కొండన్నపల్లి శాసనం, రాజధాని వేములవాడకు మార్పు, పంపకవితో అరికేశరి సాన్నిహిత్యం మొదలగు నవల ముగింపు అధ్యాయాలలో ఉంటాయి.

రాష్ట్రకూట రాజు మూడవ ఇంద్రవల్లభునికి ఇద్దరు పుత్రసంతానం, అమోఘ్ఘవర్ష-2, గోవిందుడు-4. ఇంద్రవల్లభుడి ఆకస్మిక మరణం, యువరాజు రాజుగా అమోఘవర్ష పట్టాభిషేకం, పదవీవ్యామోహంతో తమ్ముడు గోవిందుని తిరుగుబాటు, అన్నదమ్ముల మధ్య సింహాసనానికై కలహాలు, తిరుగుబాట్లు, యుద్ధాలు కూడా చర్చకు వస్తాయి. రెండవ అరికేసరి తండ్రి నరసింహభూపతి గోవిందుని పట్ల వైఖరి పట్ల అసహనం. నరసింహభూపతి హెచ్చరికలు. ఈలోగా జిన బ్రాహ్మణుడి హెచ్చరికతో అమోఘవర్షుడి అదృశ్యం, నరసింహవర్మ వృద్ధాప్యం, రాష్ట్రకూట గోవిందుడి పట్టాభిషేకం జరిగిపోతాయి. ఇంతవరకు నరసింహభూపతి బతికి ఉంటాడు. తదుపరి ఈ సంఘటన వ్యథతో కాలధర్మం చెందుతాడు. అరికేసరి బావమరిది గోవిందుడి తిరుగుబాటు సహించలేక యుద్ధ ప్రకటన, మహాభారతం వలె అర్జునిడితో పోలుస్తూ, అరికేసరిని విక్రమార్జునిగా వర్ణించుట, యుద్ధంలో గోవిందుడి ఓటమి ఉంటాయి. కానీ నవలలో పరారీగా మార్పు రచయిత చేశారు. ఇంద్రవల్లభుని తమ్ముడు. క్రీ.శ. 935 లో బద్దెగ రాజుకు (అమోఘవర్ష-3) రాష్ట్రకూట రాజుగా పట్టాభిషేకం. రాష్ట్రకూట బద్దెగడికి ఇద్దరు కొడుకులు. నాలుగేళ్ళ తర్వాత్ర క్రీ.శ. 939లో కొడుకు మూడవ కృష్ణుడి పట్టాభిషకం. 30 ఏండ్లు పాలన నవలలో ఉంటాయి.

బావమరిది ఇంద్రవల్లభ చక్రవర్తి తర్వాత చాళుక్య నరసింహభూపతి మరణం, పోదన నుండి వేములవాడకు రాజధాని మార్పు, 902లో జన్మించిన రెండవ అరికేసరి 941లో పట్టాభిషేకం, అంతకుముందే అరికేసరికి ఇద్దరు కుమారుల జననం. వేములవాడ ఆస్థానంలోకి వేంగీ సమీపంలోని వంగి పర్రు జైన బ్రాహ్మడైన కన్నడ ఆది కవి పంపమహాకవి ప్రవేశం, ఆశ్రయం, సన్మానం, ఆస్థాన కవిగా పంపడి నియామకం, పంపడి రచన ఆదిపురాణంలోని పద్యాల ప్రస్తావనలు, అరికేసరిని అర్జునిగా వర్ణిస్తూ సాగిన పంపభారత రచన, పంప భారతం, కవిత్రయం మహాభారతంలోని అంశాలపై రచయిత ప్రస్తావనలు ఆసక్తికరంగా నడుస్తాయి.

రచయిత అరికేసరి మహారాజు గారి వేములవాడ రాజ్యపాలన గూర్చి పేజీ 96లో రాశారు. అరికేసరి పాలనలో ప్రజలు సకల సంపదలతో, దొంగతనాలు, ఈతి బాధలు లేకుండా, ఐశ్వర్యంగా, కర్షకులు, వర్తకులు, చేతి వృత్తుల వారు సంతోషంగా కాలం గడుపుతున్నారు. రాష్ట్రకూట రాజు అమోషవర్షుడు రాసిన రామాయణం వస్తువుగా రాసిన కవిరాజమార్గం చందో గ్రంథం పంపకవిచే ప్రస్తావనకు వస్తుంది. వ్యాస భారతం ఆధారంగా పంపడి భారత రచన, తదుపరి పంపడి తమ్ముడు కవి జిన వల్లభుడు అరికేసరి ఆహ్వానంతో ఆస్థానానికి రాక, జినవల్లభునిచే బొమ్మలమ్మ త్రిభాషా శాసనం వేయుట తదితర అంశాలు ప్రస్తావనకు వస్తాయి.

అరికేసరి తల్లి జాకవ్వ జినవల్లభుని గంగాధకరు సమీపంలోని కొండన్నపల్లి (బొమ్మలమ్మగుట్ట) జిన ఆశ్రమంలో ఆశ్రయం పొందుట, జైన మతానికి ప్రాభవం తెచ్చిన జైన తీర్థంకరుల జాబితా 102 వ పేజీలో వివరించారు. కవిత్రయ భారతం 18 పర్వాలు, వేల పద్యాలు. పంపకవి భారతం 14 ఆశ్వాసాలు. 16వందల గద్య, పద్యాలు. చంపూకావ్యం. వేంగీ నన్నయ్య భట్టు భారత రచన కంటే 110 ఏళ్ల ముందు పంపడి భారత రచన రాయబడింది. పంపడికి ధర్మపురిని అగ్రహారంగా ఇస్తూ త్రిభాషా శాసనం ప్రస్తావించింది. జినవల్లభుడు త్రిభువన తిలకం జైన బసతి, మదన విలాసం తోట, కవితా గుణార్ణవం అనే చెరువును శాసనం వద్ద రాజు సాయంతో నిర్మించాడు. జినవల్లభునికి వాచకాభరణుడు అని బిరుదు ఉంది. ఈ శాసనంతో పాటు కవి మల్లియ రేచన రాసిన తెలుగు చందో గ్రంథంలో కవిజనాశ్రయం ఈ బిరుదు ప్రస్తావన ఉంది.

అరిపిరాల అనే పేరు కరీంనగర్ పూర్వనామము. దీనికి రెండవ అరికేసరి కాలంలో క్రీ.శ. 946 అర్పణపల్లితో వేయించిన నగనూరు శాసనం మూలమై ఉంటుంది. దీన్నే శాసన పరిశోధకులు ధూపాటి వెంకట రమణకవులు సూచించినట్లుగా రచయిత ఈ నవలలో ఉదహరిస్తూ, రెండవ అరికేసరి మహారాజు జైన హిందూ మతాలను ఒకేలా చూశాడని చెబుతారు. ఇందులకు ఉదాహరణగా ఒక బ్రాహ్మడికి దానమిచ్చిన అర్పణపల్లి శాసన ప్రస్తావన రచయిత చేశాడు. ఇలా శాసనాలు, సాహిత్య గ్రంథాలాధారాలు, ఆ నాటి ఆలయాల విశ్లేషణం, అధ్యయనం చేసి నవల రాశారు. కరీంనగర్ కు అర్పణపల్లి పూర్వ నామం వ్యవహారంలో అరిపిరాల గా మారి యుండవచ్చునన్న రచయిత అభిప్రాయం.అర్పణపల్లి శాసనంలో రెండవ అరికేసరి బిరుదాల వర్ణన ఇలా ఉంది. సమస్త సమధిగత పంచమహాశబ్ద మహా సామంతాధిపతి, సకల భువన సంస్తూయ మాన చాళుక్య వంశోద్భవం, పాంబరాంకుశ నమ్మన గంధవారణం, గందేభ విద్యాధర, నుదాత్త నారాయణం, ప్రత్యక్ష యారూఢ సర్వజ్ఞ గుణనిధి, గుణార్ణవ, ప్రియగళ్ళం, త్రిభువన మళ్ళం, సామంత చూడామణి. ఇలా అరికేసరి గుణగణాలను, పాలనా సామర్థ్యాలను ఈ శాసనం ద్వారా వెల్లడైంది. ఈ శాసనం కరీంనగర్ జిల్లా శాసనాలలో రికార్డైంది. అంతకు ముందు రెండవ అరికేసరి వేయించిన తామ్రశాసనం అలభ్యమని రచయిత రాశారు. ముగింపులో బౌద్ధ మహా బోధి, జైన వైశ్య కవి మల్లియ రేచనల మధ్య సాగిన వివిధ మతాల సంభాషణ ప్రస్తావన రచయిత ఆసక్తికరంగా తెచ్చారు. తదుపరి వీరిద్దరు అరికేసరి రాజును పంపమహాకవి గృహంలో కలుస్తారు. వేములవాడ వైశ్యులకు చెందిన నకరేశ్వరాలయానికి బస చేయడానికి వెడదాం అని రేచన అంటాడు. ఇలా వేములవాడ నగరేశ్వరాలయ ప్రస్తావన వస్తుంది.

పంపడు స్వదేశానికి వెళ్ళాలని అనుకుంటున్నట్లు తన రెండవ అరికేసరి రాజుకు చెబుతారు. ఇంతలో పంపడి భార్య కావేరి యాత్రాసందర్శనంకు వెడుతుంది. (కల్పిత పాత్ర). తదనంతరం భార్య తో కల్సి పంపకవి రాజా:తపురానికి వెళ్ళుట.. అంశాలతో పాటుగా అరికేసరి మరణాన్ని నవల ముగింపులో ప్రస్తావించారు. పంపడికి అరికేసరి రాజుకు15 ఏండ్ల సన్నిత సహావాసం ఉంది. రెండవ అరికేసరి పాలన 25 ఏండ్లు సాగింది. రాజుది ఆకస్మిక మరణం. రాజుమరణ వార్త కవి మహాకవి పంపడిని కుంగదీసింది. ఆయన కూడా రాజు చితిచూస్తూ కుప్పకూలి పోతాడు. రాజు మరణించే ఒక తార రాలి పాయె. ఇలా కవిచక్రవర్తి గుర్రం జాషువా పద్యపాదాన్ని సమయోచితంగా వాడారు. విషాద సందర్భానికి నిండుదనం తెచ్చారు.

బోధన్ లో ఏ ఒక్క రాజు సమాధి లేదు. ఒక్క శుభనంది సమాధి ఉంది. ఇది పంపకవి సన్యాస నామం అని రచయిత పేర్కొంటాడు. పేజి. 134. సామాన్య శకం 955-973 వరకు ముగ్గురు రాజుల పాలన నడిచింది. అరికేసరికి వాగరాజు, బద్దెగ భూపాలుడు ఇరువురు కుమారులు. బద్దెగనికి ఒక కుమారుడు మూడవ అరికేసరి. వాగరాజుకు పట్టాభిషేకం జరిగింది. వాగరాజు గంగాధర ఉపరాజధానిగా పాలించాడు, క్రీ.శ. 959లో కవిసోమదేవసూరి యశస్తిలక చంపూ కావ్యం, లేములవాడ చాళుక్య ప్రభువుగా బద్దెగడు క్రీ.శ. 960లో పట్టాభిషిక్తుడయ్యాడు. ఆరేళ్ళు పాలించాడు. సోమదేవసూరి కోసం బద్దెగడు వేములవాడలో శుభదామ జినాలయం నిర్మించాడు. దీనికై రేపాక గ్రామాన్ని దానం ఇచ్చాడు.

క్రీ..శ. 966 లో బద్దెగని కుమారుడు మూడవ అరికేసరి వేయించిన పర్భిణి తామ్రశాసనం, రాజన్న సిరిసిల్లా జిల్లా రేపాక శిలాశాసనం చెబుతున్నది. పర్భిణీ తామ్ర శాసనం ప్రకారం మూడవ అరికేసరి వేములవాడ రాజ్య పాలకుడైనాడు. సోమదేవసూరి పండితుని కొరకు తన తండ్రి బద్దెగడు వేములవాడలో నిర్మించిన శుభదామ జినాలయ బసదికి నవసుధాకర్మ బలి నివేద్యార్థము సబ్బి సహస్రం లోని రేపాక ద్వాదశాంతర్గత వనికటుపలు (వంతడుపుల) అనే గ్రామాన్ని దానమిచ్చినట్లు ఈ త్రామ్రశానసనం వెల్లడిస్తుంది. సామాన్య శకం 968 రేపాక శిలాశాసనము మూడవ అరికేసరి ఆ గ్రామమున ఒక జినాలయం నిర్మించినట్లు చెబుతున్నది. వీరి పాలనాకాలం సమాచారం అంతగా లేదని రచయిత రాశారు. రేపాక శాసనంలో సోమదేవసూరి జన పండితుడు. యశస్తిలక చంపూ కావ్యం, కథా సరిత్సాగరం, నీతి వాక్యామృతం గ్రంథాలు రాశాడు.

ఈ ఒక్క పండితునికి ముగ్గురు చివరి చాళుక్య రాజులు ఆశ్రయమిచ్చారు. ఇల్లా రెండవ అరికేసరివి నాలుగు శాసనాలు, మూడవ అరికేసరివి రెండు శాసనాలు వెలుగులోకి వచ్చాయి. ఇలా ఈ రెండవ అరికేసరి నవల అరికేసరి జీవితాన్ని ఆమూలాగ్రంగా వివరించింది. చక్రవర్తిగా, మహారాజుగా ఆయన సామర్థ్యాన్ని, పంపడి వంటి కవులకు ఆశ్రయమిచ్చిన తీరును, ప్రజా పాలన, వేయించిన శాసనాలు, చేసిన యుద్ధాలను, ఆ నాటి సామాజిక రీతులను వివరిస్తుంది. నవల అంటే విస్తృత కాన్వాసే. వేములవాడ చాళుక్యుల శాసనాలను, అప్పటి గ్రంథాలను అధ్యయనం చేసి నవలా రచనం చేయడం, అరకొర సమాచారమున్నా, పలు గ్రంథాలను పరిశోధించి ఒక చారిత్రక నవలగా సృజనాత్మకంగా రాసిన ప్రముఖ చరిత్రకారులైన కరీంనగర్ చరిత్రకారులు డా. మలయశ్రీ అభినందనీయులు.



# పంచామృతం (కథ)

ఆ తెల్లవారుజామున నిద్రలేచిన కౌలురైతు సాంబశివుడు కాలకృత్యాలు తీర్చుకొని, టీ తాగి, ఆరుగంటలకు తను సాగుచేసే ఆ ఊరంచు పొలం వైపు బయల్దేరాడు. అది డిశంబర్ నెల.. గత పదేళ్లుగా లేని పరిస్థితి.. ఆయేడు పది డిగ్రీలదాకా ఉష్ణోగ్రతలు పడిపో యిన దుస్థితి! అధిక చల్లదనం వల్ల, ఎకరం పొలం మేరకు వేసిన వరి పైరు కాస్త చలిపులిధాటికి రాగిరంగులోకి మారి ఎదుగుదల లోపించకుండా, నిన్న మొన్ననే పొలంలో గుంజలు పాతి, ప్రతి సాయంత్రం పైరు పైన కవర్లు కప్పడం, పొద్దున్నే మళ్లీ తీయడం ఓ పెద్దపనిగా మారిపోయింది సాంబశివుడికి!

కప్పబడిన కవర్లతో మేఘావృతమైన ఆకాశంలా అగుపిస్తున్న పంటపొలంపైనున్న కవర్లు తీస్తూ స్వచ్ఛమైన చేనుకు ప్రభాత స్వేచ్ఛనిస్తున్నాడు సాంబశివుడు! సాలు సాలున పచ్చలార బోసినట్టున్న వరిపైరు తెల్లారి వెలుగుల్లోని చల్లచల్లని పిల్లగాలులకు మెల్లమెల్లగా తలలూపుతూ సాంబశివుడికి స్వాగతం పలుకుతున్నట్టనిపిస్తుండగా.. కన్నపిల్లలను కళ్లారా చూసుకునే కన్నతండ్రిలా, వెన్నుతోనున్న ఆ వరిపొలాన్ని వెన్నలాంటి స్పర్శతో తడుముతూ, తొలికిరణాల వెచ్చని తోరణాలను ఆ పచ్చని పైరునకలంకరిస్తూ, తడితడిగా మెరుస్తున్న మడిమడినీ శ్రద్ధగా పర్యవేక్షిస్తున్నాడు సాంబశివుడు!

అంతలోనే అనుకోకుండా అతడి ఏకాగ్రత ఎటోమళ్లింది.. అక్కడి పొలాలగట్లపైన చెట్లపైనున్న పక్షుల కిలకిలస్వనాలతోపాటు ఏవో కలకలస్వరాలు వినిపించి అటువైపు చెవులు రిక్కించాడు. కుయ్ కుయ్ మంటున్న కుక్కలు మధ్యమధ్యలో భౌ భౌ మంటున్న మొరుగుడు శబ్దాలకు ఏదో కుతూహలంతో, ఒడ్డు ఒడ్డుమీద ఒడుపుగానూ వడివడిగానూ అడుగులు వేస్తూ పొలం పక్కన చింతలబావి గట్టుదాకా వచ్చాడతడు. ఆ గట్టుమీద.. ఓ గుండు పెకిలించిన గుంటకాడ, ఆ నీరెండ కాంతిలో అక్కడక్కడా అగుపిస్తున్న నేలనింకివున్న రక్తపు మరకలు.. ఉలికిపాటుతో అటూ ఇటూ చూశాడు. తన అలికిడితో ఆ గుంటనుండి బయటికి దూకిన మూడు కుక్కలు ఆ గుంటచుట్టూ తిరుగుతూ, గట్టిగా మొరుగుతూ, తననుచూసి తోకలాడిస్తూ మోరలు చాస్తూ తనకేదో చెప్పాలని చూస్తున్నాయి అపుడపుడూ తను పెట్టే సద్దిమూటముద్దలు తింటుండే ఆ మూడు కుక్కలు!

మూగ సైగలతో ఆ కుక్కలు చూపినవైపు ఆగుంటలోకి తొంగిచూశాడు. అందులో.. రంగులద్దిన ముద్దబంతిలా ముడుచుకు పడుకునివున్న ముక్కుపచ్చలారని నెత్తుటిమరకల పురిటికందు.. కనికరం లేక ఎవరో కనిపారేసిన వసివాడిన ఓ పసివాడు! ఒక్కక్షణం ప్రాన్పడిపోయాడు సాంబశివుడు! మరుక్షణం తేరుకుని మరింక ఆలస్యం చేయక ఆ గుంటలోకి దిగిచూశాడు. అంత చలిలోనూ గడ్డకట్టని ఆ పసిబిడ్డలో లీలగా ఊపిరాడుతున్న తీరు గమనించి, అంతా దేవుడిలీల అనుకొంటూ, ఆ పసిగుడ్డునెత్తుకొని తన తలగుడ్డతో చుట్టి గుండెలకు హత్తి పట్టుకొని పరుగులాంటి నడకతో ఇంటికి చేరి, ఆ పురిటి బిడ్డను తన ఇంటిదాని చేతికందించాడు!

ఆవుపాలచుక్కలతో , ఆ పసివాడి తడారిన గొంతు తడిపి, ఆపై ఒళ్లంతా నూనెరుద్ది కడిగి, తన చిన్నకొడుకు చిన్నప్పటి అంగీ ఒకటి తొడిగి, ఏ తల్లి కన్న బిడ్డకో కరుణతో కన్నతల్లిలా సాంత్వన కలిగించింది సాంబశివుడి ఇల్లాలు సుభద్ర! ఆ పై ఆ ఏరియా దవాఖానకు తీసుకొచ్చి ఆ పసివాడికి తగిన వైద్యంచేయించి, స్థానికుల సలహామేరకు పోలీసులకు సమాచారమిచ్చాడు సాంబశివుడు.

పోలీసు అధికారులా శిశువును అనాథాశ్రమంలో చేర్పించడానికి సిద్ధమైనపుడు ఎందుకో సాంబశివుడి హృదయం సంచలించిపోయింది.. హటాత్తుగా ఆ పసి వాడి వైపు అడుగువేశాడు.. జాలిగా వాడికేసిచూశాడు.

“ఒద్దు సార్ .. ఈ బిడ్డ అనాద కాకుడదు! తెల్లార్లూ ముగ్గురు భైరవదేవుళ్లు కావలుండి కాపాడి నాకు సూపించిన ఎర్రని సూరీడు.. పొద్దుపొడుపోలె నాకు దొరికిన ఈ పోరడు ఆ దేవుడిచ్చిన కొడుకని పెంచుకుంటనయ్యా”అంటూ ఆదుర్దాగా ఆ పోలీసులనభ్యర్థించాడు.

‘‘చూడు సాంబశివుడూ.. ఈ అనాథ శిశువును పెంచుకుంటానంటే, చట్టప్రకారం దత్తత తీసుకోవలసి వుంటుంది!” అని చెబుతూ ఆ విధానాన్ని సూచించారు అధికారులు. అందుకు సమ్మతించి, భార్యనొప్పించి, ఆ బాలుణ్ణి దత్తత చేసుకొన్నాడు.. “ఆడపిల్లన్నా కాకపాయె” అంటున్న , అప్పటికే ముగ్గురు మగపిల్లల తల్లి అయివున్న సుభద్ర చేతిలో మరో మగపిల్లాణ్ణి పెట్టాడు గుడినుండి తెచ్చిన ప్రసాదంలా సాంబశివుడు!

×××××××××

“పట్నం నుండేనా పటేలా? పంటసూసుకోటానికొచ్చింద్రా?”

అప్పుడే హైదరాబాదునుండొచ్చిన పొలం సొంతదారు బలరామయ్యనడిగాడు సాంబశివుడు.

“లేదురా శివుడూ.. పట్నంలో కరువైపోయిన ప్రశాంతతను, అక్కడ అగుపడని ఆత్మీయతను చూసుకోవడా నికే అక్కడున్న ఇల్లు కాస్త అమ్మేసి, ఆ ఒంటరి బ్రతుక్కి వీడ్కోలు పలికి మన ఈ పల్లెకొచ్చాను!”

అంటూ, పొలంలో ఓ మూలన వేపచెట్టు పక్కన సాంబశివుడు వేసుకున్న చిన్నపాటి పాకనీడన నులక మంచంపై కూర్చుంటూ అన్నాడు బలరామయ్య.

“తిన్నరా అయ్యా?”

“లేదురా శివుడూ..పాడీపంటల మనపల్లెను చేరుకునే తొందరలో ఆకలి సంగతే మరిచిపోయాను!”

“అమ్మంటి ఊరిని సూసి మనసు నిండింటది గానీ కడుపుకు ఆకలి తీరాలె గదయ్యా.. వేం తెచ్చుకున్న అన్నం తింటరా తినగల్గుతరా పటేలా?లేక పక్కపొలం పోషయ్యనడిగి రొండు పొప్పాయిపండ్లు తెమ్మంటరా?’’ ఆప్యాయంగా అడిగాడు సాంబశివుడు.

“ఏవీ తేనవసరం లేదు శివుడూ.. నీవు తినే అన్నమే నాకూ కొంచం పెట్టు.. ఆప్యాయత కలిసిన అన్నం అమృతంతో సమానం!”

అని బలరామయ్యనగానే.. వెంటనే కాలువగట్టు కెళ్లి పచ్చటి మోదుగాకులు తెచ్చి, ఎండుపుల్లలతో విస్తరి కుట్టి, అందులో అన్నంపెట్టి, పచ్చిమిరపకాయ పచ్చడి, పిండిచారు వడ్డించాడు! ఆపై, దొప్పలో నీళ్లమజ్జిగనందించాడు!

“రైతు మనసులోని పచ్చని మమకారంలా పచ్చడైనాఎంతో పసందుగావుంది! అన్నదాతకున్న ఆదరణగుణంలా మజ్జిగనీళ్లైనా అమృతంలా అనిపించినవిరా!” తృప్తిగా అంటున్న బలరామయ్యవైపు ఆశ్చర్యంగా చూశాడు సాంబశివుడు.

“అవును శివుడూ.. ఇకపై మీతో మమేకమై ఇక్కడే నేనీఊరిలోనే వుండడానికొచ్చాను! ఒంటరివాణ్ణి.. వయసు పైబడినవాణ్ణి.. చదువులైపోయి, జాబులకుపోయి అమెరికా పౌరులైపోయినారు నా పిల్లలు! బ్రతుకుసంధ్యలో, భార్యపోయిన బాధతో, భారమైన ఒంటరితనంతో దిగులుపడ్తుంటే.. సిటీలోని ఆ ఇల్లమ్మేసి వృద్ధాశ్రమంలో వుండమని పిల్లలు ఉచితసలహానివ్వడంతో.. ఉసూరుమనిపించిన మనసు మరేమాలోచించక.. కన్నతల్లివంటి ఈ పల్లెఒడిలో సేదదీరాలని.. చివరకు ఈ భూతల్లి ఎదపైనే కన్నుమూయాలని.. అన్నీ ఒదిలేసి ఇలా వచ్చాను శివుడూ!”

అంటున్న బలరామయ్య కంఠం వణికి కన్నీరు తొణికింది.

“బాదపడకండయ్యా.. పల్లెకన్నా తల్లిలేదు.. పొలంకన్నా బిడ్డలేదు! మీ పొలం బాగోగులు సూసుకున్నట్లే మీమంచిసెడ్డలు కూడా సూసుకుంట పటేలా!”

ఓదార్పుగానే అయినా తిరుగులేని తీర్పుగా పలికాడు సాంబశివుడు.

“భలేవాడివి శివుడూ.. ముందే ముగ్గురు పిల్లలున్న కౌలు రైతువు! పోయినేడు పంటంతా వరద పాలైన కరువు రైతువు! తా దూర కంతలేదు మెడకోడోలన్నట్టు మరో దత్తపుత్రుడికీ ఇంకనూ కుక్కలెంబడుండే దత్తుడిలా, మెడకు పట్టీలుకట్టి మరీ సాకుతున్న ఆ మూడుకుక్కలకూ తిండీతిప్పలెలాగరా? తలకు మించిన భారమైన తనకు మాలిన ధర్మం నీకెందుకురా శివుడూ?’’ అన్నాడు బలరామయ్య.

“ఆడపిల్లను కోరి అదనంగ మరో మగ పిల్లాణ్ణి కన్నం. అయినా కాయకష్టంతో, మీ పొలం పంటతో కడుపునిండా తిన్నం. ఉన్న ఉళ్ల గవర్నమెంటు స్కూల్ల పిల్లల్ని సదివించు కుంటున్నం. ఇప్పటికేం లోటులేదు. రేపటికేం లోటు రాకుండా మరింత కష్టపడ్తం. కూలో నాలో కూడా సేసుకుంట, కలో గంజో తాగుకుంట అందరినీ సాక్కుంటం పటేలా!”

**పోలీసు అధికారులా శిశువును అనాథాశ్రమంలో చేర్పించడానికి సిద్ధమైనపుడు ఎందుకో సాంబశివుడి హృదయం సంచలించిపోయింది..**

“ఎందుకంత ఇబ్బంది పడాలిరా? ఆ పిల్లాణ్ణి అనాథాశ్రమానికి, ఆ కుక్కల మెడపట్టీలిప్పి గేటుబయటికొదిలేయరాదా? ఎందుకీ కంచిగరుడసేవలు? ఉన్నోళ్లు చేయాల్సిన పనులుకదా ఇవన్నీ?”

“ఉన్నోళ్లు అంటే ఎవరయ్యా? డబ్బున్నంత మాత్రాన ఉన్నోళు కాదుకదయ్యా.. మనసున్నోళ్లే ఉన్నోళ్లు కదయ్యా!”

“అయినా.. శివుడూ.. ఆ పిల్లాడి కులమేమిటో.. మతమేమిటో.. ఏ అక్రమ సంబంధ ఫలితమో.. నీకు మనసెలా ఒప్పిందిరా?”

“అయ్యా.. ఎవరో సేసిన పాపానికి.. పాపం ఆ పసివాడేం పాపంజేసిండని వాణ్ణి సీదరించుకొనొదిలెయ్యాలె? ఇంక కులం మతం అంటరా.. మనిసికులమే వానికులం.. మంచితనమే వాని మతం! పెంచినోళ్లే వాని అమ్మలూ అయ్యలూ అన్నలూ అయినప్పుడు వాడు అనాదకాడుగదా! ఇంక ఆకుక్కల మాటంటరా పటేలా.. ఆవురావురంటూ ఆకల్తోటుండే ఊరకుక్కలవి..అయినా ఆ నెత్తుటి గుడ్డునవి పీక్కతినకుండా.. ఇంకేజీవాలూ వాణ్ని సంపేయకుండా.. సలికి సచ్చిపోకుండా తెల్లార్లు పిల్లాణ్ననంటిపెట్టుకొనుండి, తల్లిపొత్తిళ్ల ఎచ్చదనాన్నిచ్చి, కావలికాసి కాపాడిన వీరసైనికుల్లాంటివి..మనిషన్నోడు వాటికి వొందనం సేయాలె గానీ ఒదిలేయడం కాదు గదయ్యా!”

అంటున్న సాంబశివుడి స్వరం కరుణతో కంపించి అతడి కన్నీటిలో అది కనిపించింది!

“శివుడూ.. సాంబశివుడూ” అంటూ ఒక్కవుదుటున లేచి నిలబడి, అడుగు ముందుకేసి సాంబశివుడిని సాంతం కౌగలించుకున్నాడు బలరామయ్య. భేదాలు.. భేషజాలు కరిగిపోయి కన్నీరైన అతడి తడి హృదయం.. అంతరంగపు లోతుల్ని తాకి మనిషితనాన్ని తడిమిచూసుకున్నట్టనిపించింది!

“అధ్భుతం శివుడూ.. ఎన్నో గుళ్లూ గోపురాలు తిరిగాను.. ఎందరో దేవుళ్ల విగ్రహాలను దర్శించుకున్నాను..కానీ ఆ దైవత్వాన్ని మనిషితత్వంలోనే మానవత్వంలోనే నేడు నేను స్పర్శించుకుంటున్నాను!

“అయ్యా” అయోమయంగా చూశాడు శివుడు.

“అవును సాంబశివుడూ.. నిరుపేదవైనా, అనాథకాకుండా ఆ పిల్లాడినాదరించి అనాథనాథుడవయ్యావు! మున్సిపాలిటీబండికి బలైపోకుండా ఆ వీధికుక్కల్నాదరించి విశ్వాసానికి ప్రాణంపోసిన విశ్వనాథుడవయ్యావు! వృద్ధాశ్రమం పాలుకాకుండా ఈ ముసలివాడికాశ్రయమిచ్చిన మహనీయుడివైనావు!’’ అంటూ సాంబశివుడి రెండు చేతలూ కళ్లకద్దుకున్నాడు బలరామయ్య.

“అంత పెద్దమాటలెందుకయ్యా.. మట్టితప్ప మరొక్కటెరుగని పేదరైతును!పల్లెటూరి బైతును!” అంటుంటే సాంబశివుడి నోటికి తన చేయడ్డంపెట్టి వారించాడు బలరామయ్య.

“నీవు పేదరైతువు కాదు శివుడూ.. సాక్షాత్తూ అన్నపూర్ణమ్మతల్లికి వారసుడివి! అందరికీ అన్నదాతవు! పల్లెకు ప్రాణశ్వాసవు! మనిషి టి.విలు, ఫ్రిజ్ లు, ఎ.సిలు, అందాలకార్లు, అద్దాలమేడలు లేకున్నా బ్రతకగలడు కానీ అన్నం లేకుండా అసలు బ్రతకలేడు! అయినా అలాంటి విలాస వస్తువుల్ని తయారుచేసే వ్యాపారులు మాత్రం కోటీశ్వరులౌతున్నారు! కానీ ఆరుగాలం కష్ట పడుతూ అయిదుప్రాణాలు నిలబెట్టగల అన్నంపెట్టే చిన్న రైతు మాత్రం కూటికిలేని పేదవాడిగానే మిగిలిపోతున్నాడు! ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్నాడు! ఉరికంబాలకు వేలాడుతున్నాడు! అలా కాకూడదు శివుడూ..ప్రభుత్వాలతోపాటు ప్రతిఒక్కరూ రైతుకు చేయూత నివ్వాలి! పెద్దమనసున్న చిన్నరైతువు.. నీవైనా పేదరైతుగానే మిగిలిపోకూడదు శివుడూ!”

‘‘ఎంతకష్టమున్నా ఎంతనష్టమున్నా సేద్యందప్ప మరోటి సాద్యంగాని ఎర్రిబాగులోణ్ని.. ఎట్ల బాగుపడేదయ్యా?”

“అలా అనకు శివుడూ.. కన్నవాళ్లెవరో తెలియని ఓ అనాథకూ, అందరున్నా అనాథనైన నాకూ, దిక్కులేని ఆ మూడు కుక్కలకూ అన్నంపెట్టి ఆశ్రయమీయదలచి, మా అయిదుగురి అదనపు భారాన్ని పంచామృతంలా స్వీకరించి, ఆదరణలోని అమృతాన్ని ఆస్వాదించి పూర్ణమానవుడవైన నీకు నేనేమివ్వగలను? నా ఇద్దరు కొడుకులకివ్వగా మిగిలివున్న నాపేరిటవున్న ఈ ఎకరం తరిపొలాన్ని నీపేరిట పెడతాను! పట్నంలో అమ్మిన మేడింటిడబ్బుతో ఇక్కడే ఓ ఇల్లు కడతాను! అందులో మనందరం ఆత్మబంధువులమై కలిసి వుందాము!”

“అయ్యా.. పటేలా.. ఈ పేదరైతుకు.. ఈ కౌలు బతుకుకు ఇంతటి ఇలువా?” సంభ్రమాశ్చర్యాలతో తలమునకలయ్యాడు సాంబ శివుడు!

“ విలువ నీకు కాదు.. ఇలా నాకు నేనిచ్చుకున్నది! మనసు పెద్దదైవున్న వాడెవ్వడూ పేదవాడు కాడనిపించావు! ఆత్మబలమున్న, శ్రమజీవన సౌందర్యమున్న, సువిశాల మనోసామ్రాజ్యమున్న నీకన్నా మహారాజెవ్వడు శివుడూ? పుట్టిన ఈ సొంతగడ్డ నీడలో.. ఈ దేవుడిచ్చిన రైతుబిడ్డ తోడులో.. అందరి ఆదరాభిమానాలతో ఆఖరి శ్వాసదాకా హాయిగా సేదదీరగల భాగ్యాన్ని కాదనక నాక్కలిగించు సాంబశివుడూ..”అంటూ, ఆప్యాయతకూ అనుబంధానికీ తన సర్వస్వాన్ని ఫణంగాపెట్టిన బలరామయ్య, చలించిన మనసుతో చెమరించిన కనులతో ఆర్తిగా అనరాగా సాంబశివుడి భుజాలపై తన హస్తాలుంచి అభ్యర్థించాడు!



– కె.వీణారెడ్డి
7337058025

---



–డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ అమరావతి సాహితీ మిత్రులు గ్రూపులో 2024 జనవరి నుండి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా డా. రావి రంగారావు నిర్వహిస్తున్నారు.
ఈ వారం కథల వర్క్ షాపులో **“అపార్టుమెంటు జీవితాలు”** నేపథ్యంగా ఇచ్చిన అంశానికి ఉత్తమంగా ఎంపికైన సంబరాజు రమణి కథ చదవండి. –సంపాదకులు

## ఐకమత్యం

అందమైన పల్లెలో విశాలమైన పెంకు టింట్లో అనోన్యంగా జీవిస్తున్నారు. జానకి, రామనాథం దంపతులు.

కొబ్బరి తోటకి నీరు పెట్టించి వస్తానంటూ వెళ్ళిన రామనాథం పాముకాటుకి గురై మరణించటంతో జానకి ఒంటరిదైంది.

అమ్మా నువ్విక్కడ ఒంటరిగా ఉండటం మంచిది కాదు. మాతో వచ్చెయ్ అన్నారు. జానకి కొడుకు వంశీ, కోడలు వసుథ.

మనుషుల్లో గానీ ప్రకృతిలో గానీ ఇక్కడ ఉండే స్వచ్ఛత అక్కడ ఉండదు. పిచ్చుక గూళ్ళ వంటి అపార్టుమెంట్లలో తలుపులు మూసుకుని కూర్చోవటం నా వల్ల కాదు అంది జానకి.

ఒక్క పది రోజులు ఉండి చూడు నీకు నచ్చకపోతే మళ్ళీ ఇక్కడికే వచ్చేదువుగాని అన్నారు. కొడుకు , కోడలు .

మనవళ్ళతో జానకికి కాలక్షేపం బానే అవుతోంది. కానీ ఎదురు ఫ్లాట్లో ఉన్న సల్మా. పక్క ఫ్లాట్ లో ఉన్న దివ్య చనువుగా లోపలికి రావటం, వాళ్ళింట్లో చేసిన చిరుతిండ్లు పిల్లలకి పెట్టటం, కోడలుతో చనువుగా ఉండటం జానకి గమనించింది. చూచాయగ కొడుకు దగ్గర అసంతృప్తి వ్యక్తం చేసింది.

వాళ్ళు చాలా మంచి వాళ్ళు అమ్మ , మేము ఆఫీసుల నుండి రావటం ఆలస్యమైతే పిల్లల్ని కనిపెట్టుకునుంటారు అన్నాడు వంశీ.

పార్టుమెంట్ లో వినాయక చవితి నవరాత్రులు రంగ రంగ వైభంగా నిర్వహిస్తు న్నారు. సల్మా,దివ్యలు పూజకు కావలసిన సామాగ్రి అంతా సమకూరుస్తూ , వినాయక మంటపాన్ని పూమాలలతో అలంకరిస్తూ అందరికీ తల్లో నాలుకలా ఉన్నారు. ఇదంతా జానకికి సుతరాము నచ్చలేదు.

కొడుకుతో నేను మన ఊరికి వెళ్ళిపోతా రేపు అంది జానకి.

మరునాడు ఉదయాన్నే వంట చేస్తున్న వసుధ కంగారుగా వచ్చింది. ఏమండీ నాన్నకు ఒంట్లో బాగో లేదుట ఆసుపత్రిలో జాయిన్ చేశారుట అమ్మ ఫోన్ చేసింది. అంది.

పిల్లలిద్దర్నీ జానకి దగ్గర ఉంచి వంశీ,వసుధలు ఊరికి బయలుదేరారు.

వాళ్లు వెళ్ళిన కొద్ది సేపటికి పిల్లలని పాఠ శాలకు పంపే హడావుడిలో చూసుకోక తడిలో కాలేసి జారి పడటంతో కాలు బెణికి లేవలేకపో తున్న జానకమ్మను పరుగున వచ్చి జాగ్రత్తగా లేపి కూర్చోబెట్టారు. సల్మా, దివ్యలు.

పిల్లలకి, టిఫిన్ పెట్టి పాఠశాలకు పంపారు. సల్మా జానకి కాలుకు సున్నితంగా మర్దన చెయ్యటం మొదలు పెట్టింది.సల్మా భర్త మెడికల్ రిప్రజంటేటివ్ కావటంతో నొప్పి తగ్గటానికి మందులు ఇచ్చాడు. దివ్య వంట చేసుకొచ్చింది.

జానకి తినటానికి ఆలోచిస్తుంటే తినండి ఆం టీ నేను మీలాగే స్నానం చేసే వంట చేశాను. ఉల్లి, వెలుల్లి కూడా వాడలేదంటూ కొసరి కొసరి తినిపించారు. అయిష్టంగానే తిన్నది జానకి. జాన కిని కాలు కింద పెట్టనీయకుండా సపర్యలు చేశారు.

మరుసటి రోజు ఆదివారంకావటంతో హోం వర్కు చేసి వస్తామని సల్మా ఫ్లాట్ లోకి వెళ్ళిన పిల్లలు ఇంకా రాలేదేమిటి?అని కాలునొప్పి కొద్దిగా తగ్గటంతో జాగ్రత్తగా గోడలు పట్టుకుంటూ సల్మా ఫ్లాట్లోకి వెళ్ళిన జానకి విస్తుపోయింది.

సల్మా పిల్లలకి భగవద్గీత శ్లోకాలు నేర్పు తోంది. ఎంత శ్రావంగా ఉచ్చరిస్తోందో శ్లోకాలు అనుకుంది జానకి.

మరునాడు కొడుకు ,కోడలు ఊరి నుంచి వచ్చారు.

సాయంత్రం సున్నుండలు చేస్తున్న జానకమ్మ తో, అమ్మా! ఇప్పుడెందుకు సున్నుండలు చేస్తు న్నావ్? నాకు ఇష్టమనా ? అన్నాడు వంశీ. ఇవి సల్మా కోసం కడుపుతో ఉన్నవాళ్లు ఇవి తింటే చాలా మంచిది అంది జానకి.

మన ఊరికి వెళ్ళిపోతానన్నావుగా రేపు తీసుకెళ్లి దించనా ? అన్నాడు వంశీ.నేను ఏ ఊరు వెళ్ళేది లేదు. తల్లి, తండ్రి లేని సల్మాకి సీమంతం చెయ్యాలి దివ్య ప్రారంభిం చబోయే రెస్టారెంట్లో చెఫ్ నేనేట. తెలుసా! అంటున్న జానకి మాటలకి అందరూ కిలకిలా నవ్వారు.

కులమతాలకి కాక గుణగణాలకి ప్రాధాన్య మిస్తూ, మంచి, మానవత్వంతో పరిమళిస్తున్న ఈ అపార్టుమెంట్లోనే నా శేష జీవితం అంది జానకి.



–సంబరాజు రమణి
9550077219

---

## తోడు నీడ

వదలినవి దేహాలు వదలలేనివి బంధాలు
ఒట్టేసి చేపుతున్నా వదలను నీ కరములు
చేతిలో చెయ్యేసి చేసిన బాసలు
బొందిలో ప్రాణమున్నంత వరకు మరువను
ముదిమి వయసున చేతికఱ్ర ఓ ఆసరా
నీవు చెంత నుండడమే నాకు భరోసా
నా మనసుకు మధురమైన దిలాసా
చింతే లేదు నీవు నా సమక్షమున ఉండగా
చెదరదు నా చిరునవ్వు నీ తోడుగా
రెక్కలొచ్చి పక్షులు గూటిని వీడగా
రెక్కలు ముక్కలు చేసుకొన్న
మన శ్రమను వీరు మరువగా
ఏకాకి జీవనం కాదు మనది
ఏకాంత బతుకు పయనం మిగిలినది
ఒకరికి ఒకరం తోడు నీడ గా
ఈదగలం మన శేషజీవన సాగరము
అండగా నిలిచావు అష్టకష్టాలు ఎదురైనా
నీ అండదండలు అపూర్వమేగా
నీవు లేని జీవితం నిస్సారమేగా
ఆ సర్వేశ్వరుడు నా కొసగిన
గొప్ప వరము
నీవే నీవే నీవేగా

**–బి సయ్యద్ అబ్దుల్ నజీర్**
8897811025

## కృషి ఫల జయ వాణీ గీతం

శ్రమ మానవ వన నాదం
పలికేది ప్రతి క్షణపు ఆరాట మై
ఏనాడో వెలిగినది కృషి తలపున జయ రాగపు
శ్రమ నేర్చిన పట్టుదల
అనురాగపు ఫల సారం
రంగుల దాగిన పట్టు అందాల
ఆహ్వానం అది అసలుతనం
పట్టు పట్టిన పట్టు విడువని
పట్టపు జయ కీర్తికి గుర్తింపు
ప్రాణమే
జయ ధ్యానం కేతనమై రగిలించే సంకల్పమే
నేస్త సమం
జీవన సమస్త యుక్తం
ఏమున్నది శ్రమను మించిన
అవకాశం
కృషిని దాటిన అదృష్టం
పట్టు విడువని ప్రియ అంకిత భావం
నేర్చినది నేర్పును నేర్వగల ఓర్పు సొంతం
ప్రేమను నడిపిన ఆలోచనే
మనమున సంకల్పమును
రగిలించి శ్రమను జత చేసి
పలికించును జయ జయ
వెల్లువల పట్టుదలను
గానము గా పాడగలదు
ప్రతి రోజూ ఓడి గెలువ గలదు
అనుభవ ఝరీ స్వర సర్దు బాటు

**–ప్రత్యూష మిట్టపల్లి**
+91 73861 84062



## కవితార్చన

అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

“కుసుమ ధర్మన్న కళా పీఠం” సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
–సంపాదకులు

## నీడవలే

మనిషిలో మరోమనిషి నీడవలె వుంటూ
అంతర్ముఖంగా అన్నీ నడిపిస్తూ చూస్తుంటూ
పైకి సాత్వికంగా లోపల కర్కషంగా
లేదా స్వార్థంగా ప్రవర్తిస్తూ ఒక్కోసారి
మేకవన్నె పులిలా ప్రవర్తించటం
సహజంలా వుంటూ
పైకి సాధు జంతువులా నటస్తారు
అమాయకంగా
తనలా వారూ ప్రాణమున్న
మనుషులు అనుకోరు
విచిత్రంగా ప్రవర్తన
మారుస్తూవుంటారు ఊసర పిల్లిలా
కొందరు కడుపులో యెంత బాధగా వున్న
బయటకు మామూలుగానే ప్రవర్తిస్తారు
అదును చూసి
అంతంచేయ వెనుకాడని నయవంచకులు
ఎవరి ప్రవర్తన వారిని నీడలా
అనుసరిస్తూనే వుంటుంది
అవసరం వచ్చినపుడు
హెచ్చరిస్తూ క్రూరత్వానికి పాల్పడనీయదు
మంచితనం
చేతగానితనం కింద జమకడుతున్న
హాని తలపెట్టనీయదు
దాగున్న అంతర్ముఖుడు
లోకో భిన్నరుచిః అన్నట్టుగా తనబాధ
పరులబాధ ఒకేలా భావిస్తే
పరులకు యిబ్బంది రానీయరు
పరుల సేవే పరమాత్మ సేవగా తలుస్తారు
సాధు స్వభావంతో సాగిస్తారు జీవనం.....

**–కట్టా శ్యామలాదేవి**
+91 78932 29318

## భూతదయను చూపండి

పిల్లల కోసం మీరు పడే తాపత్రయం
గమనిస్తూనే ఉంటాం
ఎంతో మురిసిపోతూ ఉంటాం
మమ్మల్ని తలవకపోయినా బాధపడడం
కానీ దయతో ఇంటి ముంగిట్లో
కాస్త నీళ్లు ఉంచండి చాలు-బ్రతికి పోతాం
గాలి నీరు ఆహారం లేకుండా
ఏ జీవి బ్రతుకుదనే విషయం తెల్సిన
మీరు..
మా పట్ల భూతదయను చూపండి
కాస్తైనా...
చల్లగ ఇంటిపట్టున ఉందామంటే...
మీలాగా మేడలు మిద్దెలు
లేనివారము..
ఎవరి బారిన పడకుండా ఉందామంటే
తలుపులు లేని గూళ్ళు ,
రక్షణ లేని బ్రతుకులు మావి...
ఆకలి తీర్చుకోలేని అల్పులం మేము..
అడగడానికి మాటలు రానివారం...
రుచులు తెలియవు
కమ్మని వంటలు తెలియవు..
ప్రకృతిని నమ్ముకున్నవాళ్ళం..
పండో కాయో క్రిమికీటకాలో
మాకు ఆహారం...
అడవులను ఆక్రమించారు..
చెరువులపై ఇండ్లు కట్టారు..
చెట్టూ పుట్టలనూ వదలరు మీరు..
మనసులోని బాధ చెప్పాలంటే మీలా
మాటలు రావు..
బ్రతకడానికి నీరు ఆహారం దొరకవు..
ఒక్కసారి ఆలోచించండి..
అడవులను కాపాడండి..
మాకు రక్షణ కల్పించండి
ప్రకృతిని ప్రేమించండి పర్యావరణ
పరిరక్షణకై చర్యలు చేపట్టండి...
మావల్ల కలిగే లాభాలను
ఉపయోగించుకొండి..
మా ఆకలిదప్పులు తీర్చండి..
మాకు ప్రాణదానం చేయండి...

**–కె. లలిత**, 94927 71321

## థర్డ్ ఐ చూస్తుంది

ముఖపుస్తకంలో
ఆత్మీయులు ఉంటారు
అంగతకులు ఉంటారు
ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం
పెరగడం మూలంగా
సమాచార ప్రచార, ప్రసార విస్తృతికి
కేంద్రబిందువైదీముఖపుస్తకం.
మన వాణి బాణీకి ఫేస్ బుక్కే
ప్రధానవాహిక
ఎంతో మంది వర్ధమాన తలపండిన
కవులను
నాకు పరిచయం చేసింది.
నన్ను నేను దిద్దుకొనుటకు
అతిపెద్ద ప్లాట్ ఫామైనది.
రహస్యవేగులు ఉంటారు సుమా
అనుభూతులను అన్ని బహిరంగ
పరచడం
అంతమంచిది కాదు.
ఎవరికి వారు హద్దులేర్పర్చుకోవడం
అత్యవసరం
ముక్కు మొఖం తెలియని వాడితో
పరిచయంచేయాలంటే
ఆచితూచి అడుగేయాల్సిందే?.
త్వరితగతిన ముఖపుస్తకం
నన్ను ప్రశంసల్లో ముంచెత్తుతోంది
కానీ
కత్తికి రెండు వైపులా పదునులా
ప్రమోదముంది ప్రమాదముంది
ఈ విచక్షణ మనం కల్గియుంటే
సర్వులకు శుభప్రదం, జయప్రదం.
ఆన్లైన్ వేదికిది గూగుల్ సెర్చ్ ఇంజన్
నిన్ను గమనిస్తుంది.
సంఘవిద్రోహులు కూడా
పొంచియుంటారిచ్చట
పాలు నీళ్ళు వేరుచేయు హంసవు నీవు కావాలి.
సోషల్ మీడియా అనేది
మంచిచెడులు సమాహారం
అప్రమత్తతే శ్రీరామరక్షగా
ఫేస్బుక్ నీ ఉన్నతికో సింహద్వారం

**–అంకాల సోమయ్య**
+91 96407 48497



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## యాదికొచ్చినప్పుడల్ల

ఆకలైనప్పుడు అన్నం దొరనప్పుడు.
కాసిన్ని నీళ్లతో తిత్తిని నింపుకుంటే.
ఎండినడొక్కలో నులిమేసిన.
పేగునొప్పికి కాస్త లేపనం పూసినట్టే.
బాధ్యత నెరవేర్చుటకై
గమ్యము చేరుకొనుటలో.
అలసిన పాదాలకు.
కాస్త విశ్రాంతి నిచ్చి.
కూలబెడితే చైతన్యం
కూడగట్టుకుని.
నొప్పులు తరిమేయ బడతై.
అవిశ్రాంత పోరాటం.
నిరంతర శ్రమ ఫలితాలు.
ప్రగతిపదంలో ఉన్నత శిఖరాల.
నదిరోహించిన వేళ్ళ
దేహమంత నొప్పుల కుంపటైన
నొప్పి స్పృహనే గుర్తుకు రాదు.
భౌతిక గాయాలెన్నైన
నొప్పి! గాయం మానేవరకే.
కనిపించని మనసుకు
వినబడే ఛీత్కారాలు,
రొమ్మును పిండుకున్న పెదాలు.
పెడసరి పదాల.
అవమాన తూటాలై.
జీవమున్నంత కాలం.
నొప్పిని రాజేస్తుంటవి
యాదికొచ్చినప్పుడల్ల.

-యరకల యాదయ్య.
9866468978.

## సమాధవుతున్న స్వప్నాలు!

సైరన్ మోతలా సైతాన్ మోతలా
విమానాల విహరించే గగనతలం కాదు
యుద్ధవిమానాలు విరుచుకుపడే ఆకాశం
విధ్వంస యజ్ఞంలో
దేశం సమిధ కావడమే బాధాకరం
అలవికాని ఆధిపత్యాల
ఎడారిఎండపొద్దుల్లో
ఒప్పందాల ప్రేమలన్నీ ఆవిరే
పెత్తనాల'మోహ'రింపులో
ధిక్కరించిన దేశమే లక్ష్యం
కాలమేదైనా దేశమేదైన లెక్కలేదే పెద్దవాడికి
యుద్ధం కానుక వల్లకాడే ముమ్మాటికీ
ఆశల బహుళ అంతస్తుల
వెలకట్టలేని వేల కట్టడాల
శిధిలాలకుప్పల నుండి
కల్మశకలుషిత కాలాలకౌగిలి నుండి
శాంతి పల్లవిస్తుందా?
చుట్టుముట్టిన పోరు పోగమబ్బులు
స్వేచ్ఛా కాంతిని పొసగనిస్తాయా?
కాల్చు! చంపు!!
మనిషి మనిషిని
మంచిని మమతని
కూల్చు! కూల్చు!!
సాయుధ స్థావర కోటల్ని
స్వాతంత్ర్య పూల తోటల్ని
యుద్ధదేశంలో పారుతున్న
నెత్తురు నదుల సాక్షిగా
గుండె కోతల కన్నీళ్ల సాక్షిగా
యుద్ధమా శ్మశానం తప్ప
శత్రుదేశానికి ఇంకేమి ఇనాంగా
ఇస్తావు నీవు?
శిధిలాలు తప్ప
ఇంకేమి మిగులుస్తావు నీవు?.
అగ్రరాజ్యం ఉగ్ర కోపమా
అంహంకారం విశ్వరూపామా
ఇది?
పిట్టల్లా రాలి కాలిన
మనుషుల బూడిద కుప్పలు
శిధిలాల దిబ్బలు
శిధిలాల కింద
సమాధవుతున్న స్వప్నాలు తప్ప
ఏముంటాయక్కడ?
అడ్డూఅదుపు లేనిధనికరాజ్యం
యుద్ధదాహం! తీరుతుందా?
ధిక్కరించిన దేశం దేశంలా లేదు
భూమిభూమిలా ఆకాశం
ఆకాశంలా అసలు లేదు
బిక్కుబిక్కుమంటున్న మనుషుల
గుండెల్లో గూడుకట్టుకుంది
యుద్ధము
యుద్ధభయమే!.
క్వాంటం కాలం కాంక్షించేది
పాతరాతి యుగాన్నే అయితే
కాలాలు మూలాలు మరచి
మానవత్వం విడచి
మళ్లీ వెనక్కి పోవడం తథ్యం
బహుశా!.

-రమేశ్ నల్లగొండ
8309452179

## నిద్ర - మెలుకువ

భూమాత కు
ఎప్పుడూ
సగం నిద్ర
సగం మెలుకువ !!
మన కవి రాత్రి పగలు . .
భూమి తల్లి ఎప్పటికీ
సంపూర్ణంగా గాఢ నిద్ర పోనేపోదు
తల్లి హృదయం కదా
సప్త సముద్రాలంత దయా పాముర


-కందాళై రాఘవాచార్య
8790593638

## నిస్సందేహం !

దేహం నీది కావచ్చు
అందంచందం నీదికావచ్చు
దేహంచేసేపనులు నీవికావు
సందేహం ఎందుకు!
దేహంలో చిప్ లేకుంటే
సిమ్ము లేని సెల్లువే!
దేహం ఉన్నా నిల్లు వే!
దేహాల కార్ఖానాలో
చూపుకు కానరాని
సిమ్ము ఇన్ బుల్ట్ !
కొని మరల వేయలేనిది
మార్పిడి లేనిది
రీఛార్జింగ్ చేయలేనిది!
చార్జింగ్ ఉన్నంతసేపే
దేహానికి వైభోగం!
డిశ్చార్జింగ్ అయిపోయే దేహం
సిమ్ కు
రీచార్జింగ్ సదుపాయం లేక
ఎప్పుడు భయం భయం!
ఇది నిస్సందేహం !

-పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం



తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు.

బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు.

బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుపమానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు.

జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు.

తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది.

ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.

వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించుకున్నారు.

ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు? ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి.

ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు.

వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళు నిజం.

ఏప్రిల్ 16... కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి




-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# టీటీడీకి బ్యాటరీ బగ్గీ విరాళం

తిరుమల మార్చి 25: తిరుమల లో భక్తుల సౌకర్యార్థం ఓ భక్తుడు టీటీడీ బ్యాటరీ బగ్గీ ని విరాళంగా అందజేశారు. కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన హైడ్రోకార్ట్ టెక్నో సొల్యూషన్స్ సంస్థ ఎండీ గణేష్ జయవేల్ రూ.10 లక్షలు విలువైన బ్యాటరీ బగ్గీ వాహనాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ఎదురుగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను పేష్కార్ రామకృష్ణకు అందజేశారు .

భక్తగ్రేసరుడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తీరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 23 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 79,426 మంది భక్తులు దర్శించుకోగా 25,889 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.98 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.




# 'అక్షర సౌరాలు', 'గాయాలు నేర్పిన కావ్యాలు' పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఏప్రిల్ 15:కాప్రా, మల్కాజ్‌గిరి కవుల వేదిక ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత రాజేంద్ర ప్రసాద్ రచించిన **'అక్షర సౌరాలు',** గద్వాల సోమన్న రచించిన **'గాయాలు నేర్పిన కావ్యాలు'** పుస్తకాల ఆవిష్కరణ సభ **ఈనెల 12న** ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరం లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలు మూడు పుస్తకాలను ఎంతో అద్భుతంగా రచించారని తెలిపారు. పుస్తకాలను ఎంతో అద్భుతంగా రచించారని తెలిపారు. ప్రముఖ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అక్షర కౌముది సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ తులసి వెంకటరమణాచార్యులు, విశ్రాంత అటవీశాఖ అధికారి బంటిలింగ కృష్ణారెడ్డి, కవి ఘంటా మనోహర్ రెడ్డి, ప్రగతిశీల వీరశైవ సమాజం అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. బద్రీనాథ్, కవి గజవెల్లి సత్యనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు కుసుమ ధర్మన్న కళాపీటం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ నిర్వహణలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకున్నది.

# శంకర నారాయణ రచించిన 'వాయు పుత్ర శతకం' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఏప్రిల్ 15:ప్రముఖ జర్నలిస్ట్ హాస్యావధాని శంకర నారాయణ రచించిన **'వాయు పుత్ర శతకం'** ఆవిష్కరణ సభ శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో మంగళవారం భాషా సాంస్కృతిక సౌజన్యం తో జరిగింది. ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొని సంపుటి ఆవిష్కరణ చేసి మాట్లాడారు. శంకర నారాయణ శతక పద్య రచనా విశారదుడు అన్నారు నలభై ఐదు శతకాలు ఆయన రాయగా వాటిలో నలభై శతకాలు వివిధ దేవతలపై రాసినవి అని అభినందించారు. శంకర నారాయణ సంపుటిని లాంఛనం గా శ్రీరస్తు సాంస్కృతిక సంస్థ కార్యదర్శి కవి కె వి రమణ రెడ్డి అంకితం ఇచ్చారు రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ తన శత క సంపుటి అంకితం కు తనను ఎంచుకోవటం సంతోషం గా ఉంది అన్నారు. శంకర నారాయణ మాట్లాడుతూ రమణా రెడ్డి స్వగ్రామం తిప్పాయ పాలెం లో వెలిసిన ఆంజనేయుడు గాన సభలో కొలువైన భారీ ఎత్తున నిలిచిన వాయు పుత్రుని విగ్రహం తన రచనకు స్ఫూర్తి అని తెలిపారు వేదికపై గాయకుడు రామ కుమార్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, ఏప్రిల్ 15: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, నియమాలు పాటిస్తే ప్రాణాలు కాపాడవచ్చని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత ప్రత్యేక కార్యక్రమం మూడో రోజు బుధవారం పిల్లల రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో మౌంట్ ఫోర్ట్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాల, ప్రాముఖ్యతను వివరించారు. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రత నియమాలను తెలుసుకుని వాటిని ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అనే విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



### మానవత్వమా మానవత్వమా నీ జాడ కనలేమా

కన్నవారినే చూడని బిడ్డలు
కనపించని మానవత్వం
రోగుల దురవస్థలను కానని
వైద్యులుమరిచిన మానవత్వం
కనికరం లేని యజమానుల
కర్కశత్వం
దయలేని మానవత్వం
వీధులందు భిక్షుకుల ఆక్రందనలు
చాలీ చాలని మానవత్వం
వృద్ధుల పట్ల నిరాదరణ
సమాజపు అంధ మానవత్వం
బీదల బతుకు బాధలు
చిరునామా లేని మానవత్వం
అధికారుల ఆశ్రిత పక్షపాతం
దొరకని మానవత్వం
దౌర్జన్యకారుల దాష్టీకం
బలహీనులపై
అండగ నిలబడలేని మానవత్వం
భ్రూణహత్యల మాతృత్వ,
పితృత్వ బాధ్యత లేని
కుహనా మానవత్వం
ఆధిపత్య,అహంకారాలతో
రగులుతున్న వారి మధ్య
దిక్కులేని మానవత్వం
అణుబాంబులు,
ఆయుధాల తయారీతో
ప్రశ్నార్థకమైన మానవత్వం
స్త్రీల పీడనతో
శాపగ్రస్తమవుతున్న సమాజంలో
మూగబోయిన మానవత్వం
భూతదయలేని కసాయిల
ప్రేమరాహిత్యాన
కనలేని మానవత్వం
ప్రకృతి విధ్వంసంలో
తలా ఒక చేతులతో
అడుగంటిన మానవత్వం
జీవవైవిధ్యాన్ని చెరబట్టిన
నాగరికులదేపాటి మానవత్వం?
మానవత్వలేమితో మానవాళి
అస్తిత్వం మసకబారుతుంటే
లోకమొక శూన్యపు చిరునవ్వులో
దాగిపోతున్నది.

-రామక కృష్ణమూర్తి
బోయినపల్లి,
సికింద్రాబాద్.

### మానవత్వం ఔటాఫ్ కవరేజ్ ఏరియాలో

మానవత్వమా..!
ఏదీ నీ చిరునామా?
ఎక్కడ నీ ఆనవాలు?
ఏ మీడియా చూసినా
ఏ దినపత్రిక చదివినా
ఏమున్నది సిగ్గుచేటు తప్ప...
స్త్రీ ఆదిపరాశక్తి
సృష్టికి మూలం స్త్రీ జాతి
మహిళ లేనిదే మానవజాతికి
మనుగడ లేదు అని
మాటలు మాటలకే పరిమితమై
దగాకోరుల వక్రచూపులకు
అడుగడుగునా స్త్రీ జాతికి
అరాచకాలు అఘాయిత్యాలే
శరణం గావట్టే...
పాపాత్ముల
నీచనికృష్ట కామాంధుల
దాహానికి
పసిమొగ్గల పసిడి ప్రాయం
పరమకిరాతకానికి హతం
గావట్టే...
ప్రేమ పేరుతో వేధింపులు
కాదంటే కత్తులతో
గొంతుకోతలు
యాసిడ్ దాడులతో
ప్రాణాలు ఆవిరి గావట్టే...
నీతి నిజాయితీ లేని లోకాన
నరరూపరాక్షసుల
వికృత చేష్టలకు
పడతుల పచ్చని జీవితాలు
సర్వనాశనం గావట్టే...
కామపిశాచాల్లా ప్రవర్తించే
దుర్యోధనదుశ్శాసనులు
తిరుగాడే లోకంలో
స్త్రీ జాతి లైంగికదాడులకు
దగుల్బాజీల వేటకు
బలికాకుండా ఉండాలంటే
కన్నవారి కడుపుకోత గుండెకోత
కనుమరుగవ్వాలంటే
మానవత్వం ఔటాఫ్ కవరేజ్
ఏరియా నుండి కవరేజ్
ఏరియాలోకి రావాల్సిందే...

-కటుకం కవిత, కోరుట్ల

### మనిషి మనీషిగా మారితే

దేశమంటే మట్టికాదోయ్..
దేశమంటే మనుషుల్లోయ్..అని అన్నారు..
మరి మనిషి అన్నవారు ప్రస్తుత రోజుల్లో
కొంత కనుమరుగవుతున్నారు..
అని అనడంలో ఆశ్చర్యం లేదు..
భిన్నత్వంలో ఏకత్వం అని మన దేశానికి పేరు ఉంది..
కాని మనుషులు మతం కులం అని కొట్టుకు చస్తుంటే
ఏదీ ఆ ఏకత్వం..?
ఎన్నో అన్యాయాలు రోజు రోజుకి పెరిగిపోతుంటే...
ఎక్కడ ఉంది నీతి నిజాయతి...?
రెక్కలు వచ్చిన పక్షి గూడు వదిలి వెళ్లినట్టు..
ఉన్నత పదవులు అధిక ధన సమూపర్జన అంటూ
దేశాలు ఖండాలు దాటి...
తల్లితండ్రులని మలి దశలో వృద్ధాశ్రమాల్లో పెట్టి
వారిని అనాధలుగా చేస్తున్నారు..
ప్రేమ వివాహాలు అంటూ యువత తప్పు దారి పడుతున్నారో..
లేక కుల మత గొడవలు అంటూ
తల్లితండ్రులు వారి ప్రేమని అంగీకరించక..
కన్నప్రేమని మరిచి మృగాలుగా మారి చంపేస్తున్నారో
మానవత్వం నశిస్తుంది..
పాలించే వారే ఒక్కోసారి పీడించేవారుగా మారి..
సాధారణ మానవులని దోచుకుంటుంటే
ఎక్కడ ఉంది మానవత్వం..?
నశించాలి ఈ చెడు చర్యలు..
మనిషి అన్నవారు మనీషిగా మారిన నాడే
అసలైన మానవత్వంకి సార్ధకం..

-అప్పె షర్మిల

### మరచిపోయిన మనిషితనం

ఓ మనిషీ? ఒక్కసారి నీ హృదయాన్ని నువ్వే అడిగావా?
నువ్వు బ్రతుకుతున్నావా? లేక కేవలం నడుస్తున్నావా?.
బ్రతకడం అంటే ప్రేమ, కరుణ అని
ఎప్పుడో నేర్చుకున్న రోజుల్ని మరిచిపోయావా?.
నీ కళ్ల ముందే ఒక మనిషి పడిపోతే
నీ అడుగులు ఎందుకు ఆగవు చెప్పు?
సహాయం చేయలేని చేతులు
వీడియో తీయడానికి మాత్రం ముందుకు వస్తాయే ఎందుకు?.
అన్యాయం కేకలు వేస్తుంటే
నీ మనసు ఎందుకు మూగబోయింది?
న్యాయం వైపు నిలబడే ధైర్యం లేక
నువ్వు నిశ్శబ్దంగా చూస్తూ ఉంటావే ఎందుకు?.
లైక్స్ కోసం, షేర్స్ కోసం
ఒకరి బాధను వినోదంగా మార్చుకున్నావు?
అది చూసి నవ్వే నీ హృదయంఎప్పుడు ఇంత కఠినమైందో?.
ప్రేమ పేరుతో ప్రాణాలు తీస్తూమనిషితనం మరిచిపోయావు?
ఒక్క క్షణం అయినా ఆలోచించలేవా?
అతనికి తన వాళ్లు ఉన్నారని?.
పసిబిడ్డను ముళ్లలో పడేస్తూనీ మనసు ఒక్కసారి కూడా బాధపడలేదా?
ముసలివారి కళ్లలోని ఆవేదననీ హృదయాన్ని తాకలేదా?
ఎటు పోతోంది ఈ సమాజం?
ఎక్కడ దాగిపోయింది మానవత్వం?
మనిషిగా పుట్టడం కాదు గొప్పది?
మనిషిగా ప్రవర్తించడం నేర్చుకో మనిషీ.

-తనూజ వెంకట్
గౌరీబిదనూరు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**